నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

కుమ్రం భీమ్‌కు నివాళులర్పించిన సీఎం కేసీఆర్

హైదరాబాద్ , అక్టోబర్ 22: అడవి బిడ్డల హక్కుల పోరాట యోధుడు, కుమ్రం భీమ్ ఆశయ సాధనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. "మా గూడెం, మా తాండాలో మా రాజ్యం" అనే ఆదివాసీల తరతరాల ఆకాంక్షను తెలంగాణ ప్రభుత్వం నిజం చేసిందని ఆయన చెప్పారు.ఆదివాసీల ఆరాధ్య దైవం కుమ్రం భీమ్ జయంతి సందర్భంగా కుమ్రం భీం సేవలను స్మరించుకున్న సీఎం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని ఈ సందర్భంగా కేసీఆర్ తెలిపారు.కుమ్రం భీమ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. అమరుడు కుమ్రం భీమ్ పోరాట ప్రదేశం జోడేఘాట్‌ను అన్ని హంగులతో అభివృద్ధి పరిచామని చెప్పారు. కుమ్రం భీమ్ స్మారక చిహ్నం, స్మృతి వనం, గిరిజన మ్యూజియం ఏర్పాటు చేసి, భీమ్ పోరాట పటిమను భవిష్యత్ తరాలకు తెలియపరిచే విధంగా, అన్ని మౌలిక వసతులను జోడెఘాట్‌లో కల్పించామన్నారు.హైదరాబాద్ నడిబొడ్డున ఆదివాసీల ఆత్మగౌరవాన్ని తెలిపేలా ఆదివాసీ భవన్ నిర్మాణం చేపట్టినామని, అది ప్రారంభోత్సవానికి సిద్ధమైంది అని సీఎం వెల్లడించారు. 'జల్ జంగల్ జమీన్' అనే కుమ్రం భీమ్ నినాదంలోని స్ఫూర్తి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ, స్వరాష్ట్ర అభివృద్ధి పథంలోనూ ఇమిడి ఉందని తెలిపారు.అడవులు, ప్రకృతి పట్ల ఆదివాసీ బిడ్డలకు వుండే ప్రేమ గొప్పదని, వారి స్ఫూర్తిని ప్రతీ ఒక్కరూ కలిగి వుండాలని సీఎం ఆకాంక్షించారు.

హైదరాబాద్ శనివారం 23-10-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక:75 పేజీలు:4 వెల: రూ.1/-

ప్రజలకు టీకా మందును ఇప్పించడంలో 100 కోట్ల సంఖ్యను చేరుకొన్న సందర్భంలో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 22: "ప్రస్తుతం భారతదేశ కంపెనీల లోకి రికార్డు స్థాయి లో పెట్టుబడులు రావడం ఒక్కటే కాకుండా, యువతకై కొత్త ఉపాధి అవకాశాలు కూడా అందివస్తున్నాయి. స్టార్ట్-అప్స్ లో రికార్డు స్థాయిలో పెట్టుబడి ద్వారా యూనికార్న్ లు ఎదుగుతూ ఉన్నాయి".

"స్వచ్ఛ్ భారత్ అభియాన్ అనేది ఒక సామూహిక ఉద్యమం గా మారిన విధం గానే, అదే తీరు లో భారతదేశం లో తయారైన వస్తువుల ను, భారతీయులు తయారు చేసిన వస్తువుల ను కొనుగోలు చేయడం, స్థానిక ఉత్పత్తుల కు మద్దతు ను ఇవ్వడం అనే వైఖరి ని ఆచరణ లోకి తీసుకు రావలసి ఉన్నది."

"రక్షణ ఎంత బాగా ఉన్నప్పటికీ, కవచం ఎంత ఆధునికమైనది అయినప్పటికీ, కవచం మూర్తి రక్షణ తాలూకు హామీ ని ఇస్తున్నప్పటికీ, సమరం సాగుతూ ఉన్న వేళ ఆయుధాల ను విడువ కూడదు. అజాగ్రత్త గా ఉండటానికి ఎలాంటి కారణము లేదు. మన పండుగల ను అతి ఎక్కువ ముందు జాగ్రత్తల ను పాటిస్తూ జరుపుకోండి."

దేశం 100 కోట్ల వ టీకా మందు ను ఇప్పించడాన్ని సాధించిన సందర్భం లో దేశ ప్రజల ను ఉద్దేశించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు.

100 కోట్ల టీకా మందు డోజుల ను ఇప్పించేటటువంటి ఒక ప్రశంసా పాత్రమైనటువంటి కార్యం ఎంతో కష్టమైన పని అంటూ ప్రధాన మంత్రి తన ప్రశంస ను వ్యక్తం చేశారు. ఈ కార్యసాధన 130 కోట్ల మంది దేశ ప్రజల సమర్పణ భావానిదేనని ఆయన పేర్కొన్నారు. ఈ విజయం భారతదేశం సాధించిన విజయం. అంతేకాదు, ఇది భారతదేశం లో ప్రతి ఒక్క వ్యక్తి సాధించిన విజయం అని ఆయన అన్నారు. 100 కోట్ల టీకా మందు డోజుల ను ఇప్పించడం అంటే అది కేవలం ఒక సంఖ్య కాదని, అది దేశాని కి ఉన్న బలాని కి అద్దం పడుతోందని, అంతేకాకుండా అది చరిత్ర లో ఒక కొత్త అధ్యాయాని కి నాంది పలకడం కూడా అని ప్రధాన మంత్రి అన్నారు. ఇది కఠినమైన లక్ష్యాల ను పెట్టుకొనేటటువంటి ఒక 'న్యూ ఇండియా' యొక్క ముఖచిత్రం. అంతేకాకుండా, అటు వంటి లక్ష్యాల ను ఏ విధం గా సాధించాలో అనే అవగాహన ఉన్నటువంటి ఒక 'న్యూ ఇండియా' కూడా అని ఆయన అన్నారు.

ప్రస్తుతం భారతదేశం అమలుపరుస్తున్న టీకాకరణ కార్యక్రమాన్ని ప్రపంచం లోని ఇతర దేశాల తో చాలా మంది పోలుస్తున్నారని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. భారతదేశం 100 కోట్ల వ స్థానాన్ని మించిపోయిన వేగాన్ని సైతం ప్రశంసించడం జరుగుతోంది అని ఆయన అన్నారు. ఏమైనప్పటికీ, ఈ విశ్లేషణ క్రమం లో భారతదేశం పరుగులు మొదలుపెట్టిన చోటు ను గురించి వలువురు మరచిపోతున్నారని ఆయన చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాల కు టీకా మందుల ను గురించిన పరిశోధనల ను జరపడం లోను, టీకా మందుల ను అభివృద్ధి పరచడం లోను దశాబ్దాల అనుభవం ఉందని, భారతదేశం ఎక్కువగా ఈ దేశాలు తయారు చేసిన టీకా మందుల పై ఆదారపడుతూ వచ్చిందని ఆయన వివరించారు. ఒక శతాబ్ద కాలం లో అత్యంత పెద్దదైన మహమ్మారి తలెత్తినప్పుడు, ఈ కారణం గానే మరి విశ్వమారి తో పోరాడటం లో భారతదేశాని కి ఉన్న స్థోమత విషయం లో వేరు వేరు ప్రశ్నలు ఉదయించాయని ఆయన అన్నారు. ఇతర దేశాల నుంచి అన్ని టీకాల ను కొనడానికి అవసరమైన డబ్బు ను భారతదేశం ఎక్కడ నుంచి పోగేసుకొంటుంది టీకా మందు భారతదేశాని కి ఎప్పుడు అందుతుంది భారతదేశ ప్రజలు అసలు టీకా మందు ను తీసుకొంటారో, లేదో మహమ్మారి ప్రబలడాన్ని అడ్డుకోవడానికి తగినంత మంది ప్రజల కు భారతదేశం టీకా మందును వేయించ గలుగుతుందా .. ఇటువంటి ప్రశ్నల కు 100 కోట్ల డోజుల టీకా మందు ను ఇప్పించేటటువంటి ఈ ఘనమైన పని ని పూర్తి చేయడం ద్వారా సమాధానం ఇవ్వడం జరిగింది అని ప్రధాన మంత్రి అన్నారు. భారతదేశం తన పౌరుల కు 100 కోట్ల టీకా మందు డోజుల ను వేయించడం ఒక్కటే కాకుండా, ఎటువంటి ఖర్చు లేకుండా ఉచితం గా ఆ పనిని నెరవేర్చింది అని ఆయన నొక్కి చెప్పారు. ప్రపంచం లో ఒక ఫార్మా హబ్ గా భారతదేశాని కి ఉన్న హోదా కు గల ఆమోద ముద్ర ఇక మీదట మరింత బలపడనుంది అని ఆయన అన్నారు.

కరోనా మహమ్మారి అడుగు పెట్టిన వేళ లో భారతదేశం వంటి ఒక ప్రజాస్వామ్య వ్యవస్థ లో ఈ మహమ్మారి తో పోరాడటం చాలా కష్టం అనే ఆందోళన ప్రజల లో నెలకొందని ప్రధాన మంత్రి అన్నారు. అంత పెద్ద ఎత్తున నంయమనం పాటించడం తో పాటు, అంతటి క్రమశిక్షణ ఇక్కడ కుదిరేదానా అనేటటువంటి ప్రశ్నలు కూడా రేకెత్తాయి అని ఆయన అన్నారు. మన విషయం లో ప్రజాస్వామ్యం అంటే, 'ప్రతి ఒక్క వ్యక్తి ని కలుపుకొని ముందుకు పోవడం' 'సబ్ కా సాథ్' - అని ఆయన చెప్పారు. 'అందరికీ టీకా మందు, ఉచితం గా టీకా మందు' అనే కార్యక్రమాన్ని దేశం మొదలుపెట్టింది. టీకా మందును పేదల కు, దళితుల కు, పల్లెవాసుల కు, పట్టణ ప్రాంతాల ప్రజల కు అందరికీ ఇవ్వడమైంది అని ఆయన వివరించారు. వ్యాధి కి వివక్ష అనేది ఏదీ లేనప్పుడు, టీకాకరణ లో ఎలాంటి విచక్షణ ఉండకూడదు అనేదే దేశం ఎదుట నిలచిన ఒక మంత్రం గా ఉండింది అని ఆయన వ్యాఖ్యానించారు. మరి ఈ కారణం గానే విఐపి లకు టీకా ను పొందేందుకు హక్కు ఉంది అనే ధోరణి, టీకాకరణ కార్యక్రమం లో పై చేయి కాకుండా చూడటం జరిగింది అని ఆయన తెలిపారు.

భారతదేశం లో చాలా మంది ప్రజలు టీకా మందు ను వేయించుకోవడం కోసం వ్యాక్సీనేషన్ సెంటర్ కు వెళ్ళరు సుమా! అనే తరహా ప్రశ్నలు ఉదయించాయి అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రపంచం లో అభివృద్ధి చెందిన అనేక ప్రముఖ దేశాల లో ఇవాళ్టి కి కూడా వ్యాక్సీన్ ను వేయించుకోలా, వేయించుకో వద్దా అనేటటువంటి ఊగిసలాట కొనసాగుతోంది. అయితే భారతదేశ ప్రజలు 100 కోట్ల టీకా మందు డోజుల ను వేయించుకోవడం ద్వారా దీనికి జవాబు చెప్పారు అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ కార్యక్రమం 'ప్రతి ఒక్కరి ప్రయాస గా ఉంది', మరి ప్రతి ఒక్క వ్యక్తి తాలూకు ప్రయత్నా లను జోడించామా అంటే గనుక, అప్పుడు ఫలితాలు ఆశ్చర్యాన్ని కలిగించే విధం గా ఉంటాయి అని ఆయన అన్నారు. మహమ్మారి కి వ్యతిరేకం గా దేశం సలుపుతున్న పోరాటం లో ప్రజలు పాలుపంచుకోవడాన్ని ఒకటో అంచె రక్షణ వ్యవస్థ వలె ప్రభుత్వం తీర్చిదిద్దింది అని ఆయన అన్నారు.

భారతదేశం లో యావత్తు టీకాకరణ కార్యక్రమం విజ్ఞాన శాస్త్రం పొత్తిళ్ళ లో ప్రాణం పోసుకొంది. అది విజ్ఞాన శాస్త్ర సంబంధి క్షేత్రాల లో ఎదిగింది. చివరకు విజ్ఞాన శాస్త్ర పరమైన పద్ధతుల ద్వారా నలుదిక్కుల కు పయనించింది అని ప్రధాన మంత్రి అన్నారు. టీకా మందు తయారు కావడాని కంటే ముందు, మరి టీకా మందును ఇప్పించేటంత వరకు.. ఈ యావత్తు కార్యక్రమం ఒక శాస్త్రీయమైనటువంటి దృష్టి కోణం పైన ఆధారపడింది అని ఆయన అన్నారు. ఉత్పత్తి ని పెంచవలసిన అవసరం అనేది కూడా ఒక సవాలులా పరిణమించింది. అటు తరువాత వేరు వేరు రాష్ట్రాల కు వ్యాక్సీన్ లను పంపిణీ చేయడం, సుదూర ప్రాంతాల కు వ్యాక్సీన్ లను సకాలం లో చేరవేయడం అనే సవాళ్ళు ఎదురయ్యాయి. అయితే, శాస్త్రీయమైన పద్ధతుల ద్వారా, కొత్త ఆవిష్కరణల ద్వారా దేశం ఈ సవాళ్ళ కు పరిష్కారాల ను కనుగొంది. వనరుల ను అసాధారణమైనటువంటి వేగం తో పెంచడమైంది. భారతదేశం లోనే రూపొందించిన కోవిన్ ప్లాట్ ఫార్మ్ (అనీలితిని జూశ్రీజీబిటనీతీఎ) సామాన్య ప్రజల కు సౌకర్యవంతం గా ఉండటం ఒక్కటే కాకుండా, మన వైద్య చికిత్స సిబ్బంది కి వారి కర్తవ్యాన్ని సులభతరం గా కూడా మార్చి వేసింది.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ పట్ల దేశ విదేశాల కు చెందిన నిపుణులు, అనేక సంస్థలు చాలా సకారాత్మకంగా ఉన్నాయని ప్రధాన మంత్రి అన్నారు. ప్రస్తుతం భారతదేశ కంపెనీల లోకి రికార్డు స్థాయి లో పెట్టుబడులు వస్తూ ఉండటమే కాకుండా, యువతీ యువకుల కోసం కొత్త గా ఉపాధి అవకాశాలు కూడా అందివస్తున్నాయని ఆయన అన్నారు. స్టార్ట్-అప్స్ లో రికార్డు స్థాయిలో పెట్టుబడి రావడం వల్ల యూనికార్న్ లు ఎదుగుతున్నాయన్నారు. గృహ నిర్మాణ రంగం లో కొత్త ఉత్సాహం కూడా కనిపిస్తోందని, గత కొద్ది నెలలు గా అనేక సంస్కరణలు, కార్యక్రమాలు భారతదేశ ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందడం లో ఒక ప్రధాన పాత్ర ను పోషించాయి అని ఆయన అన్నారు. మహమ్మారి కాలం లో వ్యవసాయ రంగం మన ఆర్థిక వ్యవస్థ ను బలం గా ఉంచిందని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ద్వారా ఆహార ధాన్యాల సేకరణ ఒక రికార్డు స్థాయి లో జరుగుతోందన్నారు. రైతుల బ్యాంకు ఖాతాల లోకి డబ్బు నేరుగా చేరుతోంది అని తెలిపారు.

భారతదేశం లో తయారైన ప్రతి చిన్న వస్తువు ను కొనుగోలు చేయాలని ప్రజల కు ప్రధాన మంత్రి సూచించారు. ఆయా వస్తువులు భారతదేశం లో నివసించే వ్యక్తుల కఠోర శ్రమ ద్వారా తయారు అయ్యాయని చెప్పారు. ఇది ప్రతి ఒక్కరు ప్రయత్నిస్తేనే సాధ్యపడుతుంది అని ఆయన అన్నారు. 'స్వచ్ఛ భారత్ అభియాన్' ఏ విధం గా అయితే ఒక సామూహిక ఉద్యమం గా రూపుదాల్చిందో అదే విధం గా భారతదేశం లో తయారైన వస్తువుల ను కొనడం, భారతీయులు తయారు చేసిన వస్తువుల ను కొనడం, స్థానికం గా తయారైన వస్తువుల కు మద్దతు ను ఇవ్వడం అనేది ఆచరణ లో పెట్టాలి అని సూచించారు.

దేశం ఏ విధం గా పెద్ద లక్ష్యాల ను నిర్దేశించుకోవాలో, వాటిని ఎలా సాధించాలో తెలుసుకొందని ప్రధాన మంత్రి అన్నారు. అయితే, దీనికి గాను మనం నిరంతరం జాగ్రత్త వహించాలి అని ఆయన చెప్పారు. రక్షణ ఎంత బాగా ఉన్నప్పటికీ, కవచం ఎంత ఆధునికం అయినప్పటికీ, కవచం అనేది రక్షణ కు సంపూర్ణమైనటువంటి హామీ ని ఇస్తూ ఉన్నప్పటికీ సమరం సాగుతూ ఉండగా, ఆయుధాల ను వదలి వేయకూడదని ఆయన స్పష్టం చేశారు. అదే మాదిరి గా అజాగ్రత్త వహించడానికి ఎటువంటి కారణము లేదని ఆయన చెప్పారు. మన పండుగల ను అత్యంత జాగ్రత్త తో జరుపుకోవలసిందిగా ప్రజల ను ఆయన అభ్యర్థించారు.

ఉల్లి ధరలు మరీ అంతగా లేవు: కేంద్ర ఆహారశాఖ

న్యూఢిల్లీ, అక్టోబర్ 22:ఉల్లిగడ్డల ధరలు తక్కువగానే ఉన్నాయని, ప్రస్తుతం ఉల్లి ధరలు మరీ ఎక్కువ స్థాయిలో ఏమీ లేవని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ కార్యదర్శి సుధాన్షు పాండే తెలిపారు. ఉల్లి ధరలపై అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం ఉల్లి ఎగుమతులపై ఎటువంటి నిషేధం అవసరం లేదన్నారు. రాష్ట్రాలకు కిలో 26 రూపాయలకు ఉల్లిగడ్డలను ఇస్తున్నట్లు సుధాన్షు తెలిపారు. దేశవ్యాప్తంగా ఆవ నూనె ఉత్పత్తి 10 లక్షల మెట్రిక్ టన్నులు పెరిగినట్లు ఆయన చెప్పారు. అయితే వచ్చే ఏడాది ఫిబ్రవరిలోగా ఆవ నూనె ధరలు తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉన్నట్లు సుధాన్షు వెల్లడించారు.

ఇండోనేషియా, మలేషియాలో కూలీల సమస్యల వల్ల .. అంతర్జాతీయ మార్కెట్‌లో పామాయిల్ ధరలు పెరుగుతున్నట్లు ఆయన చెప్పారు. కానీ ఇండియాలో మాత్రం పామాయిల్ ధరలు తగ్గుతున్నట్లు ఆహార శాఖ కార్యదర్శి స్పష్టం చేశారు. ఇతర దేశాలతో పోలిస్తే ఇండియాలో నిత్యావసర ధరల నియంత్రణ వేగంగా జరుగుతున్నదని, కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో ఇది సాధ్యమవుతున్నట్లు సుధాన్షు చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించి, వినియోగదారులకు రిలీఫ్ తీసుకువచ్చేందుకు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ నిత్యం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

చైనా దాడి చేస్తే.. తైవాన్‌ను రక్షిస్తాం: బైడెన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 22: ఒకవేళ తైవాన్‌పై డ్రాగన్ దేశం చైనా దాడి చేస్తే, అప్పుడు తైవాన్‌కు అండగా పోరాడుతామని అమెరికా అధ్యక్షుడ బైడెన్ అన్నారు. తైవాన్‌ను రక్షిస్తారా అని ఓ విలేఖరి అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. అవును తాము ఆ విషయానికి కట్టుబడి ఉన్నట్లు ఆయన చెప్పారు. అయితే తైవాన్ అంశంలో తమ ప్రభుత్వ విధానంలో ఎటువంటి మార్పులేదని వైట్‌హౌజ్ ప్రతినిధి ఒకరు తెలిపారు. బైడెన్ చేసిన వ్యాఖ్యలపై కూడా తైవాన్ స్పందించింది. చైనా అంశంలో తమ విధానం ఏమీ మారదని, ఒకవేళ డ్రాగన్ దేశం దాడి చేస్తే, తామే ప్రతిదాడి ఇస్తామని తైవాన్ పేర్కొన్నది.చాన్నాళ్ల నుంచి తైవాన్ అంశంలో అమెరికా వ్యూహాత్మక మౌనాన్ని పాటించింది. అయితే తాజాగా బైడెన్ చేసిన కామెంట్ కొంత ఆసక్తిని రేపింది. తైవాన్ తమ దేశానికి చెందిన భూభాగం అని చైనా భావిస్తున్న విషయం తెలిసిందే. ఆ ప్రాంతాన్ని చేజిక్కించుకోవాలని డ్రాగన్ దేశం ఆలోచిస్తున్నది. కానీ తైవాన్ మాత్రం తనకు తాను స్వతంత్ర్య దేశంగా ప్రకటించుకున్నది. తైవాన్‌తో అమెరికాకు నేరుగా దౌత్యపరమైన సంబంధాలు లేవు. కానీ ఆ దేశానికి ఆయుధాలను అమెరికా అమ్ముతోంది.

పెట్టుబడిదారులను భాగస్వాములుగా పరిగణించే రాష్ట్రం తెలంగాణ: కేటీఆర్

హైదరాబాద్ , అక్టోబర్ 22:కొత్త పెట్టుబడిదారుల వేటలో రాష్ట్రాలు అప్పటికే పెట్టుబడి పెట్టిన ఇన్వెస్టర్లను మర్చిపోతుంటాయని, ఆ విషయంలో తెలంగాణ రాష్ట్రం భరోసా కల్పిస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా (పీఏఎఫ్ఐ) ఆధ్వర్యంలో జరిగిన 8వ జాతీయ ఫోరం 2021లో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర పాలసీలను ఆయన వివరించారు. రాష్ట్రానికి గడిచిన ఏడేళ్లలో 32 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని, వాటిలో 24 శాతం ఇప్పటికే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిన వారి నుంచే వచ్చాయని కేటీఆర్ తెలిపారు. పెట్టుబడులను సులభతరం చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, యువ ప్రొఫెషనల్స్‌ను రంగంలోకి దింపిదని ఆయన వెల్లడించారు.

వీరు రాష్ట్ర పాలసీలు, మౌలిక వసతులు వంటి వివరాలను పెట్టుబడి దారులకు వివరిస్తున్నారన్నారు. ఏడేళ్ల క్రితం రాష్ట్ర ఆవిర్భావం సమయంలో ఏర్పాటు చేసిన 'ఇన్వెస్ట్ ఇండియా' బ్యాసర్‌పై ఈ యువకులు పనిచేస్తున్నారని చెప్పారు. టీఎస్ఐపాస్ గురించి కూడా మంత్రి మాట్లాడారు. ఈ పాలసీ ప్రకారం సెల్ఫ్ సర్టిఫికేషన్‌కు ఈ విధానం అనుమతిస్తుందని, అలాగే 15 రోజుల గడువులోగా క్లియరెన్స్ ఇస్తున్నామని చెప్పారు.

ఒకవేళ ఈ గడువులోగా క్లియరెన్స్ లభించకపోతే, సదరు దరఖాస్తుకు ఆమోదం లభించినట్లేనని వివరించారు. అదే సమయంలో మానవ వనరుల అభివృద్ధిలో కూడా తెలంగాణ రాష్ట్రం ప్రత్యేక శ్రద్ధ పెడుతోందని చెప్పారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టీఏఎస్‌కే) కింద ప్రభుత్వమే నిధులు ఖర్చుపెట్టి యువకుల్లో నైపుణ్యాలను పెంచుతోందన్నారు.

స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించిన సంస్థలకు తెలంగాణ ప్రభుత్వం కొన్ని ఇన్సెంటివ్స్ కూడా ఇస్తున్నట్లు ఆయన గుర్తుచేశారు. అనేక రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం స్వాగతం పలుకుతోందని చెప్పిన కేటీఆర్.. ప్రైవేటు రంగంలోని సంపద సృష్టికర్తలు, ఎంటర్‌ప్రెన్యూర్లు, ఉద్యోగాలు సృష్టించేవారికి తగిన గౌరవం లభించేలా తెలంగాణ ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలిపారు.

అలాగే వారిని కేవలం పెట్టుబడిదారులుగా చూడకుండా భాగస్వాములుగా పరిగణిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఐసీసీఐ సెక్రటరీ జనరల్ దిలీప్ చెనాయ్, ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ కూడా పాల్గొన్నారు.

కేటీఆర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో ప్రముఖుల చేరిక..

హైదరాబాద్ , అక్టోబర్ 22: టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుకైనా పాత్ర పోషించిన నస్పూర్ మున్సిపాలిటీకి చెందిన బేర సత్యనారాయణ తిరిగి సొంతగూటికి చేరుకున్నాడు. శుక్రవారం హైదరాబాద్‌లో టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమక్షంలో టీఆర్ఎస్ లో చేశారు. ప్రస్తుతం బేర సత్యనారాయణ మున్సిపాలిటీలోని 21వ వార్డు బీజేపీ కౌన్సిలర్‌గా కొనసాగుతున్నారు. ఆయనతో పాటు 18వ వార్డు బీజేపీ కౌన్సిలర్ కోడూరి లహరివిజయ్ , ఎంబడి అంజయ్య, రంగు అరుణ్‌లకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

టీఆర్ఎస్ ఉద్యమంలో చురుకైనా పాత్ర వహించిన బేర సత్యనారాయణకు ఉద్యమ నేత కేసీఆర్‌తో మంచి అనుబంధం ఉంది. కొన్ని కారణాలతో ఆయన గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీ పార్టీలో చేరి మంచిర్యాల నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేశారు. అనంతరం బీజేపీలో చేరి, 21వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందాడు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆధ్వర్యంలో టీఆర్ఎస్‌లో చేరారు.

సొంత పార్టీలోకి తిరిగి రావడం సంతోషంగా ఉందని బేర సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్యే దివాకర్‌రావు, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

21 మంది ఐటీబీపీ జవాన్లకు అస్వస్థత

రాయ్‌పూర్, అక్టోబర్ 22: ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నాంద్‌గావ్‌లో 21 మంది ఐటీబీపీ జవాన్లు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. నిన్న రాత్రి ఐటీబీపీ జవాన్లు మాంసాహారం తిన్నారు. ఆ తర్వాత జవాన్లు అందరికీ వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. దీంతో అస్వస్థతకు గురైన జవాన్లను మలైదలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం జవాన్ల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని సీఎంహెచ్‌వో డాక్టర్ మిథిలేష్ చౌదరి వెల్లడించారు.

టీఆర్ఎస్ ద్వి దశాబ్ది ఉత్సవాల సమావేశానికి హాజరైన మంత్రులు

హైదరాబాద్ , అక్టోబర్ 22:టీఆర్ఎస్ పార్టీ ద్వి దశాబ్ది ఉత్సవాల పై తెలంగాణ భవన్ శుక్రవారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, ఎంపీ కవిత, ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, వరంగల్, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి, జనగాం, స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి, దోర్నకల్ నియోజక వర్గాల నేతలు హాజరయ్యారు.

ఈ నెల 25న జరిగే టీఆర్ఎస్ పార్టీ ద్వి శతాబ్ది ఉత్సవాల ప్లీనరీ, నవంబర్ 15న జరగనున్న తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ విజయ గర్జన సభకు సంబంధించిన కార్యాచరణపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్ టీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

అనంతరం తెలంగాణ రాష్ట్ర తొలి హోంశాఖ మంత్రి దివంగత నాయిని నర్సింహారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

మాజీ మంత్రి నాయినికి నివాళులు అర్పించిన మంత్రి ఐకే రెడ్డి

హైదరాబాద్ , అక్టోబర్ 22:దివంగత మాజీమంత్రి నాయిని నరసింహా రెడ్డికి దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి నివాళులర్పించారు. నాయిని నరసింహా రెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని లోయర్ ట్యాంక్ బండ్లోని పింగళి వెంకట్రామ్ రెడ్డి ఫంక్షన్ హాల్ లోజరిగిన కార్యక్రమంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పాల్గొన్నారు. నాయిని చిత్ర పటానికి ఆయన పుష్పాంజలి ఘటించారు. తెలంగాణ ఉద్యమంలో నాయిన పాత్ర మరువలేనిదన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నరసింహారెడ్డి నిరంతరం పోరాడారని మంత్రి కొనియాడారు.

ఉప్పెనలా గులాబీ దండు కదలాలి : మంత్రి కేటీఆర్

హైదరాబాద్ , అక్టోబర్ 22: తెలంగాణ రాష్ట్ర సమితి ప్లీనరీ, ద్విదశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. టీఆర్ఎస్ శ్రేణులంతా ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు.

ఈ నెల 25న హైదరాబాద్ లో పార్టీ ప్లీనరీ, నవంబర్ 15 న వరంగల్ లో జరగనున్నతెలంగాణ విజయగర్జన సభ నన్నాహాలపై వరున సమావేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో తెలంగాణ భవన్ లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని 9 అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య నేతలతో కేటీఆర్ శుక్రవారం భేటీ అయ్యారు. టీఆర్ఎస్ ప్లీనరీ, ద్విదశాబ్ది వేడుకలు, పార్టీ సంస్థాగత నిర్మాణంపై శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశానికి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జడ్పీ చైర్ పర్సన్లు, జడ్పీ చైర్మన్, ఇతర ముఖ్య నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..నవంబర్ 15న వరంగల్ లో జరిగే విజయ గర్జన సభకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలన్నారు.ప్రతి గ్రామం నుంచి గులాబీ దండు కదలి రావాలని పిలుపునిచ్చారు. బహిరంగ సభ కార్యాచరణ కోసం గ్రామ, మండల స్థాయి కార్యకర్తల సమావేశాలను స్థానిక ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామం నుంచి కచ్చితంగా కమిటీ సభ్యులు హాజరయ్యేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమం మరింత విజయవంతంగా ముందుకు వెళ్ళేలా పార్టీ శ్రేణులు పని చేయాలన్నారు.ఎన్నికలు ఏవైనా గెలుపు టీఆర్ఎస్ దేనని, గతంలో అధికారంలో ఉన్న ఏ పార్టీకి ఇలాంటి విజయాలు ద

టాటాల వశమైన ఏయిర్ ఇండియా - ప్రైవెటీకరణ తలుపులు తెరిచిన భారత ప్రభుత్వం

(ఏయిర్ ఇండియాను చేజిక్కించుకున్న టాటా కంపెనీ నేపథ్యంలో)

ఏడేండ్ల మోదీ ప్రభుత్వ పాలనలో ప్రధాన తొలి అడుగుగా ఏయిర్ ఇండియా కంపెనీ ఆస్తులు టాటా కంపెనీ చేతుల్లోకి మారడంతో 'ప్రైవెటీకరణ' ఆలోచనలకు బీజాలు పడ్డట్లు అయ్యింది. 1932లో జెఆర్‌డి టాటా చొరవ, ముందు చూపుతో టాటా ఏయిర్‌లైన్స్ సంస్థ భారత్‌లో స్థాపించబడింది. 1948లో టాటా ఏయిర్‌లైన్స్‌లో 49 శాతం ప్రభుత్వ పెట్టుబడులతో (25 శాతం టాటా, 25 శాతం పబ్లిక్ పెట్టుబడులు) ఏయిర్ ఇండియా ఇంటర్నేషనల్ విమాన సర్వీసులు ప్రారంభమైనాయి. 1953లో ఏయిర్ ఇండియా కంపెనీని జాతీయం చేయడంతో టాటాలు వైదొలగడం, తరువాత నాలుగు దశాబ్దాల కాలం దేశీయ విమానయానాన్ని ఇండియన్ ఏయిర్‌లైన్స్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. 1994-95లో ప్రైవేట్ ఏయిర్‌లైన్స్‌కు అనుమతులు ఇవ్వడంతో పోటీలో నిలబడలేక ఇండియన్ ఏయిర్‌లైన్స్ ప్రతిష్ట క్రమంగా మసకబారడం ప్రారంభమైంది. 2000-01లో యన్‌డిఏ ప్రభుత్వం 40 శాతం ఏయిర్ ఇండియా పెట్టుబడుల ఉపసంహరణకు ప్రయత్నాలు చేసింది. సింగపూర్ ఏయిర్‌లైన్స్, టాటా గ్రూప్‌లు 40 శాతం వాటాలు కొనడానికి చొరవ చూపగా, ప్రతిపక్షాల ప్రైవెటీకరణ వ్యతిరేక ఉద్యమాలతో ఆగిపోయాయి. 2004-14 మధ్య యుపిఏ ప్రభుత్వం ప్రైవెటీకరణను పక్కన పెట్టడం జరిగింది. ఏయిర్ ఇండియా క్రమంగా నష్టాల పాలుకావడంతో ప్రభుత్వానికి గుదిబండగా మారడం చూశాం.

2014లో నరేంద్ర మోదీ నేతృత్వంలో యన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రైవెటీకరణ ఆలోచనలు నిద్ర లేచాయి. 2017లో కేబినెట్ కమిటీ ఆన్ ఎకనమిక్ అఫేర్స్, సిసిఈఏ నిర్ణయంతో పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవెటీకరణల నిర్ణయాలు తీసుకోవడంతో ఏయిర్ ఇండియా అమ్మకానికి విధానపరమైన అడుగులు పడ్డాయి. 2018లో 76 శాతం వాటాలను అమ్మడానికి ప్రకటన జారీ చేయగా ఎవరు ముందుకు రాలేదు. మార్చి 2021లో ప్రభుత్వ వివరాల ప్రకారం ఏయిర్ ఇండియా ప్రతి రోజు 20 కోట్ల నష్టాలు రికార్డు కావడంతో ప్రైవెటీకరణ లేదా పెట్టుబడుల ఉపసంహరణ లేదా కంపెనీని మూసివేయడం తప్పదని తేల్చారు. ఏప్రిల్ 2021లో ఏయిర్ ఇండియాను 100 శాతం ప్రైవెటీకరణ చేయడానికి ప్రైవేట్ కంపెనీల నుంచి బిడ్లను ప్రభుత్వం ఆహ్వానించింది. సెప్టెంబర్ 2021లో టాటా గ్రూపు బిడ్లను సమర్పించగా అక్టోబర్ 2021లో ఏయిర్ ఇండియాను టాటా కంపెనీ రూ: 18,000 కోట్లకు (రూ: 2,700 కోట్ల నగదు, రూ: 15,300 కోట్ల అప్పులు) స్వంతం చేసుకుందని మనకు తెలుసు. ఏయిర్ ఇండియాలో 141 ఏయిర్ క్రాఫ్టులు (42 లీజుకు తీసుకున్నవి, 99 స్వంతమైనవి) టాటా కంపెనీ స్వంతం కానున్నాయి. ఏయిర్ ఇండియా కంపెనీ 68 ఏండ్ల తరువాత పుట్టింటికి చేరడంతో ప్రభుత్వానికి బరువు తగ్గడం, టాటా గ్రూపుకు ఉత్సాహం పెరగడం చూస్తున్నాం. ఐయంయఫ్ అభిప్రాయం ప్రకారం ఏయిర్ ఇండియా ప్రైవెటీకరణ భారత్ ప్రైవెటీకరణ ప్రయత్నాలలో ఒక ముఖ్యమైన మైలురాయిలా నిలుస్తున్నదని తెలిపారు. రోజుకు ప్రజల సొమ్ము రూ: 20 కోట్ల నష్టం వస్తున్నందున వీలైనంత త్వరగా ఏయిర్ ఇండియాను వదులుకోవాలని భారత ప్రభుత్వం చూస్తున్నట్లు తెలుస్తున్నది.

ఏయిర్ ఇండియా ప్రైవెటీకరణ సజావుగా జరగడంతో రాబోయే రోజుల్లో మరిన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవెటీకరణకు దారులు తెరుచుకున్నాయి. ప్రైవెటీకరణ జాబితాలో భారత జీవిత భీమా (యల్ఐసి) కంపెనీ ముందు వరుసలో ఉండడంతో సమీప భవిష్యత్తులో యల్ఐసి కూడా ప్రైవేట్ కంపెనీల చేతుల్లోకి చేరనుందని తెలుస్తున్నది. దేశంలోని జీవిత భీమా కంపెనీల్లో దాదాపు 60 శాతానికి పైగా మార్కెట్ చేజిక్కించుకున్న యల్ఐసి ఆస్థుల విలువ రూ: 36 ట్రిలియన్లుగా తేల్చారు. వాజిపాయ్ నేతృత్వంలోని యన్‌డిఏ ప్రభుత్వరంగ మాడ్రన్ ఫుడ్స్, మారుతీ ఉద్యోగ్, బాల్కో, హిందుల్థాన్ జింక్, ఇండియన్ పెట్రోకెమికల్స్, వియస్‌యన్‌యల్, హిందుస్థాన్ టెలీప్రింటర్స్ లాంటి 12 పియస్‌యుల వాటాలను అమ్మగలిగింది. నాటి కేంద్ర ప్రభుత్వంలో పెట్టుబడుల ఉపసంహరణలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను కూడా ఏర్పాటు చేయడం మనకు విధితమే. నష్టాల బాటలో నడుస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవెటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాల/ఉద్యోగుల నిరసన గళాలు వింటూనే ఉన్నాం. నేడు ప్రభుత్వాలు నష్టాలతో కంపెనీలు నడపాలా లేదా ప్రైవెటీకరణతో నష్టాలను తప్పించుకోవాలా అనే అంశం పలు చర్చలకు, వాదనలకు దారి తీస్తున్నది. నేటి డిజిటల్ యుగంలో పోటీని తట్టుకుంటూ ప్రపంచదేశాల సరసన సగర్వంగా నల్లబడటానికి ఆర్థికంగా బలీయమైన భారతంగా అవతరించాల్సి ఉంది. ఏయిర్ ఇండియాను తిరిగి చేజిక్కించుకున్న టాటా కంపెనీ దేశాభివృద్ధిలో, ప్రజాసేవలో ముందడుగు వేయాలని మనసారా ఆశిద్దాం. ఆల్ ది బెస్ట్ టాటా. జై హింద్, జై భారత్.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

ఫామ్ హౌస్ పాలన అవసరమా?: కిషన్ రెడ్డి

హుజూరాబాద్, అక్టోబర్ 22:హుజూరాబాద్ ఉప ఎన్నిక ప్రచారం జోరుగా సాగుతోంది. బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఈటల తరుపున కాషాయ నేతలు అంతా హుజురాబాద్ లోనే మకాం వేశారు. కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం బుజునూరు గ్రామంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈటల తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలంగాణ ఆత్మ గౌరవానికి, కేసీఆర్ అహంకారానికి మధ్య జరుగుతున్న ఎన్నిక హుజురాబాద్ అని ఆయన అన్నారు. ఏడేళ్ళుగా తెలంగాణ ప్రజలను కేసీఆర్ మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు.

రాష్ట్రంలో జరిగే ప్రతి కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని, కరోనా కారణంగా ప్రతి పేదింటికి ఉచితంగా బియ్యం ఇస్తున్నామన్నారు. ధర్మం వైపు ఉన్న ఈటల రాజేందర్ ను గెలిపించాలని కోరారు. అక్రమంగా సంపాదించిన డబ్బులతో హుజురాబాద్ లో గెలవాలని కేసీఆర్ చూస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ డబ్బులను నమ్ముకొని ఎన్నికల్లో ముందుకు వెళ్తున్నారన్నారు. మనకు ఫామ్ హౌస్ పాలన కావాలా? సంక్షేమ పాలన కావాలా? ఒకసారి ఆలోచించండి అని ప్రజలను కోరారు.

దళిత బంధు పై కేసీఆర్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. దళితులకు ఇస్తామన్న 3 ఎకరాల భూమి హామీ ఏమైందని ప్రశ్నించారు. దళిత బంధు రావడానికి కారణం ఈటల రాజేందరే అని పేర్కొన్నారు. తెలంగాణలో ఉన్న ప్రతి దళితునికి దళితబంధు పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ నియంతృత్వ పాలనకు ప్రజలు చరమ గీతం పాడాలంటే హుజురాబాద్ లో ఈటల రాజేందర్ ను గెలిపించాలని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

కొత్త ఖాతాల్లోకి డబ్బులు.. ఈటలపై ఎస్ఈసీకి టీఆర్ఎస్ ఫిర్యాదు

హుజూరాబాద్, అక్టోబర్ 22:హుజూరాబాద్ ఉప ఎన్నికకు సమయం దగ్గర పడుతోంది. ఉన్న అతి కొద్ది సమయంలోనే ప్రజలను ఆకర్షించాలని ప్రధాన పార్టీల నేతలు విశ్వ ప్రయ్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రలోభాల పర్వం మొదలైంది. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదుల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే పలు మార్లు బీజేపీ అభ్యర్థి ఈటలపై ఈసీకి ఫిర్యాదు చేసిన అధికార టీఆర్ఎస్ పార్టీ.. మరోసారి కంప్లైంట్ చేసింది.

బీజేపీ అభ్యర్థి హుజురాబాద్‌లో ఓటర్లకు డబ్బులు పంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి శశాంక్ గోయల్ కు టీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. హుజురాబాద్ నియోజక వర్గంలో కొత్త బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఈటల అక్రమాలపై చాలాసార్లు ఫిర్యాదు చేశామని.. అయినా చర్యలు తీసుకోవడం లేదని అంటున్నారు. ఈటలపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని శశాంక్ గోయల్‌కు కోరారు. ఈ మేరకు ఎస్ఈసీని టీఆర్ఎస్ ఎమ్మెల్యే కాంతి కిరణ్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి, టీఆర్ఎస్ నేత గట్టు రామచంద్రరావు కోరారు.

ఎప్పటి లెక్కనే ఇంటర్ ఎగ్జామ్స్

హైదరాబాద్ , అక్టోబర్ 22:తెలంగాణలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు యథాతథంగా జరగనున్నాయి. ఈ నెల 25 నుంచి జరగాల్సిన ఫస్ట్ ఇచర్ ఎగ్జామ్స్ రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర తల్లిదండ్రుల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం అత్యవసర విచారణ చేపట్టింది. లంచ్ మోషన్ పిటిషన్ వెనక్కి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. పిటిషన్ దాఖలు చేయడంలో ఆలస్యం అయ్యిందని కోర్టు వెల్లడించింది. విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కోర్టు వివరించింది. తెలంగాణ వ్యాప్తంగా 4 లక్షల 50 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

వంద కోట్ల టీకాలు వేసిన ఘనత-భారత పురావస్తు శాఖ

న్యూఢిల్లీ, అక్టోబర్ 22:ప్రపంచంలోనే అతిపెద్ద మరియు వేగవంతంగా టీకాలు వేసే కార్యక్రమాల్లో ఒకటిగా, భారతదేశం వంద కోట్ల కోవిడ్ టీకాలు వేసిన ఘనతను సాధించిన సందర్భంగా, కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ పరిధిలోని భారత పురావస్తు శాఖ, దేశవ్యాప్తంగా వంద స్మారక చిహ్నాలను త్రివర్ణ శోభితం గా విద్యుత్ దీపాలతో అలంకరిస్తోంది. కోవిడ్ మహమ్మారి కి వ్యతిరేకంగా పోరాటంలో నిర్విరామ కృషి చేసి, సహకరించిన, కరోనా యోధుల పట్ల గౌరవం మరియు కృతజ్ఞతగా, స్మారక చిహ్నాలను ప్రకాశవంతం చేసే ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.

యునెస్కో గుర్తింపు పొందిన ప్రపంచ వారసత్వ ప్రదేశాలైన - ఢిల్లీలోని ఎర్రకోట, హుమాయూన్ సమాధి, కుతుబ్ మినార్; ఉత్తర ప్రదేశ్‌లోని ఆగ్రా కోట, ఫతేపూర్ సిక్రీ; ఒడిశాలోని కోణార్క్ ఆలయం; తమిళనాడులోని మామల్లపురం రథ దేవాలయాలు; గోవాలోని సెయింట్ ఫ్రాన్సిస్ అస్సిసి చర్చి; ఖజురహో; చిత్తూరు కోటలు; రాజస్థాన్ లోని కుంభల్ గఢ్; బీహార్ లోని పురాతన నలంద విశ్వవిద్యాలయం త్రవ్వకాలలో బయల్పడ్డ శిథిలాలు; ఇటీవల ప్రపంచ వారసత్వ హోదా లభించిన గుజరాత్ లోని ధోలవీర లతో సహా వంద స్మారక చిహ్నాలను త్రివర్ణ శోభితంగా, విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు.

మహమ్మారిని సమర్థవంతంగా ఎదుర్కొవడంలో దేశానికి సహాయపడటానికి తమ కర్తవ్యాని కి మించి కృషి చేసిన - టీకాలు వేసిన సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది, అనుబంధ వైద్య సిబ్బంది, సహాయక కార్మికులు, పోలీసు సిబ్బంది వంటి కరోనా యోధులు, మానవజాతికి చేసిన నిస్వార్థ సేవలకు కృతజ్ఞతలు తెలియజేయడానికీ, అదేవిధంగా, భారతదేశం వంద కోట్ల టీకాలు వేసిన ఘనతను సాధించిన సందర్భంగా, వంద స్మారక చిహ్నాలు 2021 అక్టోబర్, 21 రాత్రి త్రివర్ణ శోభితంగా ప్రకాశిస్తూ ఉంటాయి.

వైరస్ వ్యాప్తిని నియంత్రించడంలో, మూడవ దశ రాకుండా నిరోధించడంలో, టీకాలు వేసే కార్యక్రమం ముఖ్యమైన పాత్ర పోషించింది. అదేవిధంగా, వంద కోట్ల కోవిడ్ టీకా మోతాదులను వేయడం ద్వారా చైనాతో పాటు బిలియన్ మోతాదులు వేసిన జాబితాలో చేరిన ఏకైక దేశం గా భారత్ అవతరించింది.

ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటైన మంత్రివర్గ సంఘం (సిసిఇఏ)

న్యూఢిల్లీ, అక్టోబర్ 22:పిఎమ్ గతి శక్తి - నేషనల్ మాస్టర్ ప్లాన్ (ఎన్ఎమ్ పి)కి ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ సంఘం (సిసిఇఏ) ఆమోదం తెలిపింది. దీనిలోమల్టీ-మాడల్ కనెక్టివిటీ ని సమకూర్చడం కోసం ఎన్ఎమ్ పి ని అమలు లోకి తీసుకు రావడం, పర్యవేక్షణ లతో పాటు సమర్ధనాత్మక యంత్రాంగానికై ఉద్దేశించినటువంటి సంస్థాగతఫ్రేమ్ వర్క్‌ను స్థాపించడం భాగం గా ఉన్నాయి.

పిఎమ్ గతి శక్తి-ఎన్ఎమ్ పి ని గౌరవనీయ ప్రధాన మంత్రి2021 అక్టోబర్ 13 న ప్రారంభించారు. దీని అమలు సంబంధి ఫ్రేమ్ వర్క్ లో కార్యదర్శుల సాధికార సమూహం (ఇజిఒఎస్), నెట్ వర్క్ ప్లానింగ్ గ్రూపు (ఎన్ పిజి) లతో పాటు అవసరమైన సాంకేతికదక్షతలతో పరిపూర్ణమైనటువంటి టెక్నికల్ సపోర్ట్ యూనిట్ (టిఎస్ యు) లు కలసి ఉంటాయి.

కేబినెట్ సెక్రటరీ ఇజిఒఎస్ కు అధ్యక్షత వహిస్తారు. దీనిలో సభ్యులు గా 18 మంత్రిత్వ శాఖ ల కార్యదర్శులు ఉంటారు. దీనికి లాజిస్టిక్స్ డివిజన్అధిపతి మెంబర్ కన్వీనర్ గా వ్యవహరిస్తారు. లాజిస్టిక్స్ సంబంధిత దక్షత కుపూచీ పడటం కోసం పిఎమ్ గతి శక్తి-ఎన్ఎమ్ పి అమలు తీరును సమీక్షించడానికి మరియు పర్యవేక్షించడానికిఇజిఒఎస్ కు అధికారాన్ని దత్తం చేయడమైంది. దీనికి ఎన్ఎమ్ పి కి తదుపరి దశ లోఏవైనా సవరణల ను చేపట్టడానికి గాను ఫ్రేమ్ వర్క్‌ను, నియమావళి నినిర్దేశించే అధికారం ఉంటుంది. ఇజిఒఎస్ వేరు వేరు కార్యకలాపాల ను ఏక కాలం లోనిర్వహించడం కోసం ప్రక్రియ ను, తుది రూపురేఖలను నిర్ధారిస్తుంది. మరి ఇది మౌలిక సదుపాయాలఅభివృద్ధి తాలూకు వేరు వేరు కార్యక్రమాలు ఈ సంయుక్త ఏకీకృత డిజిటల్ ప్లాట్ ఫార్మో భాగం అయ్యేటట్లుగా కూడాను చూస్తుంది. ఇజిఒఎస్ వివిధ మంత్రిత్వ శాఖల..ఉదాహరణ కు ఉక్కు, బొగ్గు, ఎరువులు వంటి వివిధమంత్రిత్వ శాఖల కు అవసరమైనప్పుడు టోకున వస్తువులను చాకచక్యంగా చేరవేసే డిమాండు నుతీర్చడం కోసం ఏయే చర్యల ను చేపట్టాలో కూడా ఆలోచిస్తుంది.

నెట్ వర్క్ ప్లానింగ్ గ్రూపు (ఎన్ పిజి) స్థాపన, కూర్పు మరియు అధికార క్షేత్రానికి కూడా సిసిఇఏ ఆమోద ముద్ర వేసింది. ఎన్ పిజి లో సంబంధిత మౌలిక సదుపాయాల మంత్రిత్వ శాఖల కు చెందిన నెట్ వర్క్లానింగ్ యూనిట్ ల అధిపతులు పాలు పంచుకొంటారు. అంతేకాక ఇది (ఎన్ పిజి) ఇజిఒఎస్ కు సాయపడుతుంది కూడాను.

దీనికి తోడు, నెట్ వర్క్ ల సమగ్రఏకీకరణ లో ఇమిడి ఉన్న జటిలతల ను దృష్టి లో పెట్టుకొని, ఏదైనా ఒక ప్రాంతం యొక్క సమగ్ర అభివృద్ధి కి ఉద్దేశించిన పనుల లో చేసిన పనినే మళ్ళీ మళ్ళీ చేయకుండా ఉండడం కోసం, పథకం తాలూకు ప్రభావఉత్పాదకత ను పెంచడం తో పాటు మైక్రో ప్లానింగ్ డిటైలింగ్ మాధ్యమం ద్వారాలాజిస్టిక్స్ ఖర్చుల ను తగ్గించడానికి గాను ఆవశ్యక దక్షతల ను సమకూర్చడానికి ఒకటెక్నికల్ సపోర్ట్ యూనిట్ (టిఎస్ యు) కు ఆమోదం తెలపడమైంది. టిఎస్ యుస్వరూపాన్ని కూడా ఆమోదించడమైంది. టిఎస్ యు లో విమానయానం, సముద్ర రవాణా, సార్వజనిక రవాణా, రైళ్ళు, రహదారులు, రాజ మార్గాలు, నౌకాశ్రయాలు వగైరా విభిన్న మౌలికసదుపాయాల రంగాల కు చెందిన నిపుణుల కు చోటు ను కల్పిస్తారు. అంతేకాదు, అర్బన్ ఎండ్ ట్రాన్స్ పోర్ట్ ప్లానింగ్, నిర్మాణాలు(రహదారులు, వంతెనలు మరియు భవనాలు), విద్యుత్తు, పైప్ లైను, జిఐఎస్, ఐసిటి, ఫైనాన్స్/మార్కెట్పిపిపి, లాజిస్టిక్స్, డేటా ఎనలిటిక్స్ వగైరా సబ్జెక్టుల కు చెందిన సబ్జెక్ట్ మాటర్ ఎక్స్ పర్ట్స్ (ఎస్ఎమ్ఇ స్) కూడా టిఎస్ యు లో పాలు పంచుకొంటారు.

పిఎమ్ గతి శక్తి - ఎన్ఎమ్ పి ని ఆయా విభాగాలు వేటికవే గిరిగీసుకొని పని చేసే పద్ధతి ని ఛేదించడం కోసం మరియు మరింత సమగ్రమైనటువంటి, ఏకీకరణ తో కూడినటువంటి ప్రణాళిక ను రచించి, ఆ ప్రాజెక్టుల అమలుకు దోహదం చేయాలనే ఉద్దేశ్యం తో ప్రవేశపెట్టడమైంది. మల్టి-మాడల్ కనెక్టివిటీలో సమస్యల ను, అలాగే లాస్ట్ మైల్కనెక్టివిటీ లో సమస్యల ను తీర్చాలి అన్నది దీని పరమావధి గా ఉంది. ఇదిలాజిస్టిక్స్ వ్యయాన్ని కుదించడం లో సహాయకారి గా ఉంటుంది. దీని ద్వారావినియోగదారుల కు, రైతుల కు, యువత కు, అలాగే వ్యాపారాల లోతల మునక లు అయిన వారికి కూడాను ఆర్థిక లాభాలు అనేకం గా దక్కుతాయి.

ఈ ఆమోదం తో, పిఎమ్ గతి శక్తిఆరంభ ప్రక్రియ మరింత జోరు ను అందుకొంటుంది. ఫలితం గా దేశం లో మౌలిక సదుపాయాలకల్పన అభివృద్ధి కి ఒక సమగ్రమైనటువంటి మరియు ఏకీకృతమైనటువంటి ప్రణాళికపూర్వకఫ్రేమ్ వర్క్ సిద్ధం కాగలదు.

ఈ ఆమోదం తో, పిఎమ్ గతి శక్తివేరు వేరు స్టేక్ హోల్డర్స్ ను ఒక చోటు కు తీసుకు వస్తుంది. రవాణాతాలూకు వివిధ మాధ్యమాల ను ఏకీకృతం చేయడం లో కూడా ఇది తోడ్పడుతుంది. మల్టి-మాడల్ కనెక్టివిటీ ని లక్ష్యించిన పిఎమ్ గతి శక్తి-ఎన్ఎమ్ పి కేంద్రం లోసమగ్ర పరిపాలన కు పూచీ పడుతుంది. దీని కేంద్ర స్థానం లో భారతదేశ ప్రజానీకం, భారతదేశ పరిశ్రమ లు, భారతదేశతయారీదారులతో పాటు భారతదేశం లోని రైతు లు ఉన్నారు.

జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా ఎస్పీ రమణ కుమార్

-నేరాల అదుపునకు తీసుకుంటున్న చర్యలు.

-కేసుల పరిశోధన, పెండింగు కేసుల అంశాలపై సంబందిత అధికారులతో సమీక్ష.

సంగారెడ్డి అక్టోబర్ 22 (నేటినిజం ప్రతినిధి) సంగారెడ్డి జిల్లా ఎస్పీ రమణ కుమార్ గారు గురువారం ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సంగారెడ్డి లోని పోలీస్ కళ్యాణ మంటపంలో శాంతి భద్రతలు, నేరాల అదుపునకు తీసుకుంటున్న చర్యలు, కేసుల పరిశోధన, పెండింగు కేసులు మొదలైన అంశాలపై సంబందిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో చర్చించిన ముఖ్యమైన అంశాలు...

-తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్ రావు గారు నిన్న పోలీస్ మరియు ఎక్సైజ్ పోలీసు అధికారులతో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడానికి తీసుకోవలసిన చర్యల గురించి విస్తృత సమావేశం నిర్వహించారని, ఇందులో గంజాయి, గుట్కా, మట్కా, పేకాట వంటి సామాజిక రుగ్మతలను ఖచ్చితంగా రూపుమాపాలని సీ ఎమ్ గారు ఆదేశించారని తెలిపారు.

-మాదక ద్రవ్యాలకు బానిసైన వ్యక్తి వాటి కోసం ఎటువంటి నేరం చేయడానికైనా సిద్ధమవుతాడాని, ఇలా యువత తమ జీవితాన్ని నాశనం చేసుకోకుండా ఉండటం కోసం మరియు శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండటం కోసం సంగారెడ్డి జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగం జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

-శాంతి భద్రతల సమస్యలు ఉన్న చోటుకి పెట్టుబడులు కూడా రావని, ఔఎఓజి వంటి ప్రతిష్టాత్మక పారిశ్రామిక ప్రాంతం ఉన్న సంగారెడ్డిలో విదేశీ పెట్టుబడులు రావాలంటే, ఇక్కడ శాంతి భద్రతలు పూర్తిగా అదుపులో ఉండాలని తెలిపారు.

-స్థానికంగా గంజాయిని అమ్మే వారిని పట్టుకుంటే చాలదని, అది ఎక్కడి నుండి సరఫరా అవుతుంది, ఎవరు దానిని నిర్వహిస్తున్నారు మరియు దానికి ఎవరు డబ్బులు సమకూర్చుతున్నారు అనే పూర్తి వివరాలను రాబట్టి, సంబంధిత నేరస్తులకు శిక్ష పడేలా చేయాలని ఎస్పీ గారు సూచించారు.

-ఎవరైనా రైతులు తమ పొలాల్లో గంజాయిని పండిస్తే, వారు రైతు భీమా, రైతు బంధు వంటి ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా భావించబడతారు, అదేవిధంగా అసైన్మెంట్ ల్యాండ్ లో గంజాయి పండిస్తే ఆ భూమిని ప్రభుత్వం స్వాధీన పరచుకుంటుంది అనే విషయం ప్రజలకు తెలిసేలా అవగాహన కల్పించాలని ఎస్పీ గారు సంబంధిత అధికారులకు సూచించారు.

-సొసైటీలో మాదక ద్రవ్యాలను నిర్మూలించకపోతే రేపు మన పిల్లలు కూడా వీటికి బానిసలుగా మారే అవకాశం ఉందని ఎస్పీ గారు తెలిపారు.

-గంజాయిని పండించినా, రవాణా చేసినా, కలిగియున్నా లేక గంజాయి రవాణా కోసం డబ్బులు సమకూర్చినా లేక గంజాయిని నిల్వ చేయడానికి సహకరించినా యన్ డి పి యస్ ఆక్ట్ ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయన్న విషయం ప్రజలకు తెలియచేయాలని కోరారు.

-పేకాటను జిల్లాలో కంట్రోల్ చేయడం జరిగిందని, ఇంకా ఏక్కడైనా పేకాట నిర్వహిస్తున్నారని గాని లేక ఆడుతున్నారని గాని తెలిస్తే కఠినంగా వ్యవహరించాలని మరియు దీపావళి పండుగ పేరుతో కూడా ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ గారు సూచించారు.

-మూత పడిన ఫార్మా కంపెనీలలో నిషేధిత మాదక ద్రవ్యాలు తయారుచేసే అవకాశం ఉంది కావున సంబంధిత పోలీస్ అధికారులు ఇటువంటి కంపెనీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

-ఎవరైనా పోలీస్ అధికారి/సిబ్బంది గంజాయి అక్రమ రవాణా దారుల పట్ల ఉదాసీనత ప్రదర్శించినా లేక సహాయాన్ని అందించినా సంబంధిత పోలీసుపై కేసు నమోదు చేయడంతోపాటు ఉద్యోగం నుండి డిస్మిస్ చేయబడతారని ఎస్పీ గారు హెచ్చరించారు.

-మాదక ద్రవ్యాలకు సంబందిచిన సమాచారం ప్రజలకు తెలిస్తే పోలీసులకు తెలియచేయాలనీ, సమాచారం అందించిన వారి పేరు గోప్యంగా ఉంచడంతోపాటు తగిన నగదు పారితోషికం ఇస్తామని ఎస్పీ గారు తెలిపారు.

-గంజాయి అక్రమ రవాణా జరిగే అవకాశం ఉన్న రహదారులపై వాహన తనికీలు నిర్వహించడానికి ప్రత్యేక టీమ్ లతో ప్రతీ రోజు ఎదో ఒక చోట ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపడతామని ఎస్పీ గారు తెలిపారు.

-మాదక ద్రవ్యాల నిరోధానికి కృషి చేసి పూర్తి స్థాయిలో అదుపు చేసిన అధికారులకు, సిబ్బందికి ప్రోత్సాహకాలు అందించబడతాయని తెలిపారు.

-ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ కే.సృజన గారు, డిఎస్పీ లు సత్యనారాయణ రాజు గారు, శంకర్ రాజు గారు, భీమ్ రెడ్డి గారు, బాలాజీ గారు, యస్ బి డిఎస్పీ శ్రీనివాస్ నాయుడు గారు, డి సి ఆర్ బి సి ఐ రామ కృష్ణారెడ్డి గారు మరియు అన్ని సబ్ డివిషన్ల సి ఐ లు, యస్ ఐ లు పాల్గొన్నారు.

కేంద్ర,రాష్ట్ర పోలీసు బలగాల దిగ్బంధంలో హుజురాబాద్ నియోజకవర్గం

- పగడ్బందీ చర్యలతో రేయింబవళ్ళు విధినిర్వాహణలో పోలీసులు

-స్వయంగా పరిశీలిస్తున్న పోలీస్ కమీషనర్ వి సత్యనారాయణ

కరీంనగర్, అక్టోబర్ 22:(నేటినిజం ప్రతినిధి): ఉప ఎన్నిక నేపథ్యంలో హుజురాబాద్ నియోజకవర్గం కరీంనగర్ కమీషనరేట్, కేంద్ర, రాష్ట్రంలోని వివిధ పోలీసు బలగాల దిగ్బంధంలో కొనసాగుతోంది. గత వారంరోజుల నుండి కేంద్ర బలగాలు, రాష్ట్రంలోని వివిధ విభాగాలకు చెందిన పోలీసులు చేరుకుంటుండటంతో నియోజకవర్గంలోని ప్రతిగ్రామంలో నిర్వహిస్తున్న పోలీసు కవాతులతో ఉప ఎన్నిక నిర్వాహణ అంశాన్ని కరీంనగర్ కమీషనరేట్ పోలీసులు ఒక సున్నితమైన అంశంగా పరిగణిస్తూ ఒకపక్క టెక్నాలజీ వినియోగంతో, మరోపక్క శాంతిభద్రతలు, ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి సమన్వయంతో ఏఒక్క చిన్న సంఘటన చోటుచేసుకోకుండా పగడ్బందీ చర్యలతో ముందుకుసాగుతున్నారు.

దేగకళ్ళతో కొనసాగుతున్న నిఘా

ఎన్నికల ప్రచారం గడువు ముగింపు దశకు రానున్నందతో పోలీసులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలకు పాల్పడే వారిపై డేగకళ్ళతో నిఘాను కొనసాగిస్తున్నారు. స్పెషల్బ్రాంచి, టాస్క్ఫోర్స్, ఫ్లైయింగ్స్క్వాడ్‌లు, చెక్పోస్టులు ఏర్పాటు చేయడంతోపాటు రేయింబవళ్ళు కొనసాగిస్తున్న వివిధ రకాల తనిఖీలతో అక్రమాలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తున్న వారిని కట్టడి చేస్తున్నారు. ఓటర్లను డబ్బు,మద్యం, ఇతర రకాల వస్తువులతో మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్న వారు పట్టుబడుతున్న సంఘటనలను పరిశీలిస్తే ఏస్థాయిలో పోలీసుల పగడ్బందీ చర్యలు అమలవుతున్నాయో అవగతం అవుతోంది.

పోలీస్ కమీషనర్ ప్రత్యక్ష పరిశీలన, ప్రతి చర్యపై సమీక్ష

అల్లర్లు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో నూతనంగా సిసి కెమెరాలను కొన్నిగంటల వ్యవధిలో ఏర్పాటు చేశారు. పోలీస్ కమీషనర్ వి సత్యనారాయణ టెక్నాలజీ చర్యలు, పోలీసులు రేయింబవళ్ళు చేపడుతున్న చర్యలను ప్రత్యక్షంగా పరిశీ

స్వార్థం కోసమే ఈటల రాజీనామా.. ప్రజల కోసం కాదు : ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

ఇల్లందకుంట/ఇల్లందకుంట రూరల్, అక్టోబర్ 22:: ఈటల రాజేందర్ తన పదవికి స్వార్థం కోసం రాజీనామా చేశాడే తప్ప ప్రజల అవసరాల కోసం కాదని, ప్రజల కోసం రాజీనామా చేయని ఆయనకు ప్రజలు మళ్ళీ ఎందుకు ఓటు వేయాలో చెప్పాలని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, మాజీఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రశ్నించారు.

హుజూరాబాద్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు, పాతర్లపల్లి, బోగం పాడు, గడ్డివానిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో తిరుగుతూ కారు గుర్తుకు ఓటేసి గెల్లు శ్రీనివాస్ యాదవ్ ను గెలిపించాలని కోరారు.

ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో వినోద్‌కుమార్ మాట్లాడుతూ నాడు తెలంగాణ ఉద్యమంలో భాగంగా తెలంగాణ ఇస్తానన్న కాంగ్రెస్ పార్టీ తన హామీని నిలుపుకోలేదు కాబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి తెలంగాణ సాధించడం కోసం టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామాలు చేశామన్నారు. అప్పుడు ప్రజలు తమ కోసం, తమ ప్రాంతం కోసం రాజీనామా చేశారని మమ్మల్ని దీవించి మళ్ళీ గెలిపించారు.

మరీ ఇప్పుడు ఈటల రాజేందర్ ఎందుకు రాజీనామా చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాజీనామా చేసినప్పటి నుంచి ఒక కారణమైన చెప్తాడని చూశానని, కానీ ఇంత వరకు చెప్పలేదని, ఎందుకు రాజీనామా చేశారో ఆయనకే స్పష్టత లేద న్నారు. ఈటలది తన బాధే తప్ప ప్రజల బాధ కాదన్నారు. తెలంగాణ కోసం 2001లో ఉద్యమం మొదలైనప్పటి నుంచి తాను సీఎం కేసీఆర్ వెంట ఉన్నానని తెలిపారు. ఈటల రాజేందర్ మాత్రం 2003లో టీఆర్ఎస్ పార్టీలోకి వచ్చారన్నారు.

అప్పుడు ఈటల రాజేందర్ తాను గజ్వేల్ నుంచి పోటీ చేస్తానని, ఎందుకంటే తన పౌల్ట్రీఫారాలు అక్కడే ఉన్నాయని సీఎంతో చెప్పారని గుర్తు చేశారు. హుజూరాబాద్ ప్రాంతంలో పోటీ చేయనని అక్కడి నుంచి ఎప్పుడో వెళ్లొచ్చానని చెప్పి నట్లు చెప్పారు. అప్పటికే కరీంనగర్ జిల్లాలో టీఆర్ఎస్ పార్టీ మెజార్టీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలను కైవసం చేసుకొని జడ్పీ చైర్మన్ కైవసం చేసుకొని జిల్లాలో బలమైన పార్టీగా ఎదిగిందన్నారు. అలాంటి బంగారు పల్లెం లాంటి ఈ ప్రాంతంలో ఈటల రాజేందర్‌కు సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారని వివరించారు.

అలాంటి కేసీఆర్‌ను పట్టుకొని బొంద పెడ్తా అంటావా అని మండిపడ్డారు. గులాబీ జెండా లేకపోతే నువ్వు పౌల్ట్రిఫాం యజ మానివి మాత్రమేనన్నారు. సీఎం కేసీఆర్ రైతుల ఆత్మవిశ్వాసం పెంచి గౌరవంగా ఉండేందుకు రైతుబంధు కింద 5వేలు ఇచ్చి వారి ఆత్మగౌరవాన్ని కాపాడారన్నారు. ఏడాదికి 1200 కోట్లు రైతుబీమా కోసం ఖర్చు చేసి ప్రమాదవశాత్తు చని పోతే కుటుంబానికి 5లక్షలు ఇప్పించి వారి ఆత్మగౌరవాన్ని సీఎం కాపాడారన్నారు. వీటితో పాటు కళ్యాణలక్ష్మీ, ఆసరా పింఛన్లు, ఉచిత కరంటు, ఒంటరి మహిళకు పింఛన్లు ఇస్తున్న కేసీఆర్‌కు మానవత్వం లేదంటావా అని ప్రశ్నించారు.

మా బీజేపీ ప్రభుత్వం పరిపాలించే 15 రాష్ట్రాల్లో, కేంద్రంలో ప్రధాని ఉన్నారు, మరీ ఇలాంటి పథకాలు అక్కడ ఎందుకు లేవో చెప్పాలని ఈటలను డిమాండ్ చేశారు. దళితబంధులాగే మిగతా వారికి కూడా పథకాలు అందజేస్తామన్నారు. తెలంగాణ పేద రాష్ట్రం కాదని, కొత్త పథకాలకు కూడా రూపకల్పన చేస్తున్నామని, అప్పుడు వద్దు అన్నా కూడా ప్రజలు టీఆర్ఎస్ కే ఓట్లు వేసే పథకాలు రాబోతున్నాయని స్పష్టం చేశారు. కావున ప్రజలు పనిచేసే ప్రభుత్వానికి అండగా నిలిచి టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాసును గెలిపించాలని కోరారు.

ఈటలవి నయవంచన, మోసపూరిత మాటలు : సుంకె రవిశంకర్, చొప్పదండి ఎమ్మెల్యే

ఈటల రాజేందర్‌వి పూర్తిగా నయవంచన, మోసపూరిత మాటలని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో రవిశంకర్ మాట్లాడుతూ ఈటల రాజేందర్ హుజూరాబాద్‌కు ఏం చేశాడని, ఏం చేశానని ఓట్లు అడుగుతున్నాడన్నారు.

దళితబంధుపై కుట్రలు చేసి ఈటల రాజేందర్ ఆపించారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ దేశానికే దిక్సూచిలా మారిందని పేర్కొన్నారు. ఈ నెల 30న సీరియల్ నంబర్ 2 మీద కారు గుర్తుకు ఓటేసి గెల్లు శ్రీనివాసును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

పనిచేసే ప్రభుత్వాన్ని ఆదరించాలి : కనుమల్ల విజయ, జడ్పీ చైర్‌పర్సన్

ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడుతూ ఇన్ని రోజులుగా కష్టపడి పనిచేసిన మనం, మరో 5 రోజులు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. గెల్లు శ్రీనివాస్ గెలిస్తే మనమందరం గెలవడమే కాకుండా అభివృద్ధి చెందుతామని చెప్పారు.





ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ ధ్యేయం.. మహిళల భద్రతకు పెద్ద పీట

హైదరాబాద్ , అక్టోబర్ 22:మహిళల భద్రత, ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖా మంత్రి తానేటి వనిత అన్నారు. ఆర్థిక భారం అయినా లెక్క చేయకుండా నిధులను కేటాయిస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ. 500 కోట్లను కేటాయిస్తే వైసీపీ ప్రభుత్వం రూ. 1800 కోట్ల రూపాయలను కేటాయించి మహిళల పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకుందన్నారు. శుక్రవారం ఐ.సి.డి.ఎస్ సి.డి.పి.ఓ లు, సూపర్ వైజర్లతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా.. అంగన్వాడి కేంద్రాలను రెగ్యులర్ గా తనిఖీలు తనిఖీలు చేయాలనీ ఆదేశించారు. క్షేత్ర స్థాయి లో వై.ఎస్.ఆర్ సంపూర్ణ పోషణ్, పోషణ్ ప్లస్ కార్యక్రమాల క్రింద అందిస్తున్న ఎండు ఖర్జూరం, బెల్లం, చిక్కీలు, గుడ్లు నాణ్యంగా ఉండడం లేదని కొన్ని చోట్ల ఫిర్యాదులు అందుతున్నాయని, ఈ పరిస్థితి ప్రభుత్వానికి చెడ్డ పేరును తెస్తుందన్నారు. నాణ్యమైన సరుకులు రానపుడు డెలివరీ తీసుకోకుండా తిరిగి పంపించి వేయాలని అన్నారు. స్టాక్ వచ్చేటప్పుడే వెరిఫికేషన్ చేసుకోవాలని, నాణ్యత లేని వాటిని సరఫరా చేసిన వారికి నోటీసు లు జారి చేయాలనీ సూచించారు. తరచుగా అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేస్తుంటేనే అక్కడి లోపాలు అధికారుల దృష్టికి వస్తాయని, లోపాలను సవరించుకుంటే గ్రామాల్లో మెరుగైన సేవలు అందించగలమని అన్నారు. ఈ తనిఖీలతో అంగన్వాడీ కేంద్రాల్లో బోగస్ నమోదును కూడా తగ్గించవచ్చని అన్నారు. ఒక తనిఖీకి మరొకసారి వెళ్లి చేసిన తనిఖీ కి మధ్య జరిగిన మార్పులను కూడా గుర్తించాలన్నారు. ప్రభుత్వం గర్భిణీల, బాలింతల, పని పిల్లల ఆరోగ్యానికి కేటాయిస్తున్న నిధులు వృద్ధా కాకుండా లబ్ధి దారులకు అందిన నాడే ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాధ్యమవుతుందని అన్నారు. రాష్ట్రంలో క్లిష్టమైన ఆర్థిక పరిస్థితి ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలుచేస్తున్న ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే మీరంతా చిత్త శుద్ధితో పని చేయాలనీ హితవు పలికారు.

ఇంటర్‌నెట్ గవర్నెన్స్‌కు సంబంధించిన వారందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడానికి నవంబర్ 2021 లో ఇండియా ఇంటర్నెట్ గవర్నెన్స్ ఫోరం సమావేశాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 22:ఇండియా డిజిటలైజేషన్ కోసం మార్గదర్శక ప్రణాళిక (రోడ్‌మ్యాప్)పై చర్చలతో ఇండియా ఇంటర్నెట్ గవర్నెన్స్ ఫోరమ్ (ఐఐజీఎఫ్) సన్నాహక కార్యక్రమం ముగిసింది. ఇండియా ఇంటర్నెట్ గవర్నెన్స్ ఫోరమ్ (ఐఐజీఎఫ్) సమావేశాలకు సన్నద్ధం కావడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ, నిక్సీ మల్టీస్టాక్హోల్డర్ గ్రూప్ సంయుక్తంగా వచ్చే నెల 8 నుంచి 11 తేదీల మధ్య నిర్వహిస్తాయి. ఇంటర్నెట్ శక్తి ద్వారా భారతదేశంలో డిజిటలైజేషన్ మార్గంలో ప్రగతి సాధించలిగే దిశగా చర్చలకు ఇది వేదికగా నిలుస్తుంది. ఇండియా ఉ ఇంటర్నెట్- ఇండియాస్ డిజిటల్ జర్నీ, గ్లోబల్ రోల్, ఈక్విటీ, యాక్సెస్ ఉ క్వాలిటీ-, అందరికీ హై-స్పీడ్ ఇంటర్నెట్, ఇంటర్నెట్ గవర్నెన్స్‌లో సైబర్ నార్మ్స్, ఎథిక్స్ వంటి ముఖ్యమైన విషయాలపై మూడు సర్వసభ్య సమావేశాలను నిర్వహిస్తారు. యూఎన్-ఆధారిత ఇంటర్నెట్ గవర్నెన్స్ ఫోరమ్ (ఐజీఎఫ్) ట్యునిస్ ఎజెండాలోని ఐజీఎఫ్-పేరా 72 కి అనుగుణంగా ఇండియా ఇంటర్నెట్ గవర్నెన్స్ ఫోరం (ఐఐజీఎఫ్) ఏర్పాటు చేయడమైనది. బహిరంగంగా సమగ్ర ప్రక్రియ ద్వారా, ఐఐజీఎఫ్ గ్లోబల్ ఇంటర్నెట్ గవర్నెన్స్ ఎకోసిస్టమ్‌లో ప్రభుత్వం, పరిశ్రమ, పౌర సమాజం, విద్యాసంస్థలు సహా అందరినీ ఇంటర్నెట్ గవర్నెన్స్ పై చర్చలో సమాన భాగస్వాములుగా చేస్తుంది.

ఈ సన్నాహక కార్యక్రమం లక్ష్యం డిజిటలైజేషన్‌కి సంబంధించిన రోడ్‌మ్యాప్‌పై చర్చించడంతోపాటు అన్ని విషయాలనూ వివరించడం. అంతర్జాతీయ విధాన అభివృద్ధిలో ఇంటర్నెషనల్ గవర్నెన్స్ పాత్ర ప్రాముఖ్యతను ప్రముఖంగా ప్రస్తావిస్తుంది. దీనివల్ల ప్రపంచ వేదికపై భారతదేశం ఒక ముఖ్యమైన భాగస్వామిగా మారుతుంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఉ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. యూఏఎస్జీ చైర్మన్ డాక్టర్ అజయ్, సీడీఈపీ ప్రెసిడెంట్ డాక్టర్ జల్జిత్ భట్టాచార్య, సీసీఏఓఐ డైరెక్టర్ అమృతా చౌదరి, ఎన్ఐఎక్స్ఐ సీఈఓ డాక్టర్ అనిల్ కుమార్ జైన్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఉ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, "భారతదేశంలో ఇంటర్నెట్ పరిణామ చరిత్రలో కీలకమైన సమయంలో ఐఐజీఎఫ్ జరుగుతోంది. మనం కరోనా నుండి బయటపడుతున్నాం. ప్రపంచవ్యాప్తంగా వ్యాపారాలు, పాలనల పునరుద్ధరణలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. డిజిటలైజేషన్ రేటు విపరీతంగా పెరిగింది. వేగవంతమైంది కూడా" అని ఆయన వివరించారు.

సాంకేతిక పరిజ్ఞానం వైపు ప్రయాణం ద్వారా అందుతున్న భారీ అవకాశాల గురించి రాజీవ్ చంద్రశేఖర్ స్పందిస్తూ "ప్రస్తుతం మన దగ్గర 80 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్నారు. భారతదేశాన్ని అతిపెద్ద అనుసంధాన దేశంగా మార్చారు. మా ప్రభుత్వం 120 కోట్ల ప్రజలకు కనెక్టివిటీ అందించడానికి కట్టుబడి ఉంది. ఇప్పటికీ దాదాపు 40 కోట్ల మందికి నెట్‌వర్క్ అందుబాటులో లేదు. ఇంటర్నెట్ శక్తి అందరికీ అందుబాటులో ఉండేలా చూసుకోవడం ముఖ్యం. మేము డిజిటల్ అంతరాలను తొలగిస్తాం " అని విశదీకరించారు.

ఇంటర్నెట్ గవర్నెన్స్ ను మరింత విస్తరించడంపై మాట్లాడుతూ "అందరికీ సమాన అవకాశాలను కల్పించాలనే భావనను బలపరుస్తున్నందుకు గర్విస్తాను. ప్రధాన మంత్రి నేతృత్వంలోని మా ప్రభుత్వం, సమ్మిళిత భాగస్వామ్యంతో నడిచే పాలనా విధానాన్ని విశ్వసిస్తుంది. ఇక్కడ అతిపెద్ద వాటాదారులు ఇంటర్నెట్ వినియోగదారులు కాబట్టి ఇంటర్నెట్ వినియోగదారుల స్వరం జాతీయ, అంతర్జాతీయ ఫోరమ్‌లలో ప్రతిధ్వనించడం ముఖ్యం. ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ ప్రమాణాలు సాంకేతికతలను ఈ పబ్లిక్ ఫోరమ్ నిర్ణయిస్తుంది. మాది ప్రపంచంలోని అతిపెద్ద అనుసంధాన దేశమే అయినప్పటికీ, ఇందులో మా పాత్ర తక్కువగా ఉంది"అని ఆయన అన్నారు. ఇంటర్నెట్ వాడకందారులు తప్పనిసరిగా కలిసి ఉండాలని, ఇంటర్నెట్ ఎలా ఉండాలో చర్చించుకోవాలని సూచించారు. వాటాదారులు ఏం కోరుకుంటారనేదే మాకు ముఖ్యమని స్పష్టం చేశారు. ఇంటర్నెట్ ఓపెన్‌గా, సురక్షితంగా విశ్వసనీయమైనదిగా ఉండాలని, దాని వాటాదారులకు జవాబుదారీగా ఉండాలని రాజీవ్ చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు.

ఐఐజీఎఫ్ చైర్పర్సన్ అనిల్ కుమార్ జైన్ మాట్లాడుతూ, "భారతదేశంలో అతిపెద్ద ఇంటర్నెట్ జనాభా ఉంది. అధిక జనాభా వల్ల మనకు ప్రయోజనాలు ఉన్నాయి. విధాన చట్రం రూపకల్పన, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల ఆవిర్భావంలో ప్రైవేట్ కంపెనీల పాత్ర ఉత్తేజకరమైనది. డిజిటల్ ఎకానమీ పరిణామానికి ఇదే సమయం. ఆర్థిక వృద్ధి కోసం ఇంటర్నెట్ శక్తిని ఉపయోగించుకోవడంలో వాటాదారులందరినీ కలుపుకోవాలి. ఈ విషయంలో ఇండియా ఇంటర్నెట్ గవర్నెన్స్ ఫోరం ఒక అడుగు ముందుంటుంది"అని అన్నారు.

యూఏఎస్జీ చైర్మన్ డాక్టర్ అజయ్ దేతా మాట్లాడుతూ "భారతదేశంలో మనకు 19,000 మాండలికాలు, 121 భాషలు 22 అధికారిక భాషలు ఉన్నాయి. భారతీయ పౌరులకు తమకు నచ్చిన డొమైన్ పేరు దొరకాలి. సార్వత్రిక ఆమోదం కలిగిన అన్ని డొమైన్ పేర్లను అంగీకరించాలి. ప్రపంచంలో 11 శాతం ఈ?మెయిల్ సర్వర్లు మాత్రమే హిందీకి మద్దతు ఇస్తాయి. మనకు నచ్చిన భాషలో కంటెంట్‌ని వినియోగించగలగాలి. ఐఐజీఎఫ్ ప్రారంభించడానికి ఇది సరైన సమయం. ఇందులో ఎక్కువ మంది ప్రజలు పాల్గొంటారని మేము ఆశిస్తున్నాము. ఇది మేము ఇప్పుడే ప్రారంభించిన ప్రయాణం. ఇది ముగింపు కాదు. ఇలాంటి మరిన్ని చర్చలు జరగాలని మేము ఆశిస్తున్నాం"అని ఆయన వివరించారు.ఇండియా ఇంటర్నెట్ గవర్నమెంట్ ఫోరం యూఎన్ ఇంటర్నెట్ గవర్నెన్స్ ఫోరమ్ (యూఎన్-ఐజీఎఫ్) తో ముడిపడి ఉన్న ఒక కార్యక్రమం. ఇంటర్నెట్ గవర్నెన్స్ ఫోరమ్ (ఐజీఎఫ్) బహుళ-వాటాదారుల వేదిక. ఇది ఇంటర్నెట్‌కు సంబంధించిన ప్రజా విధాన సమస్యలపై చర్చించడానికి వివిధ వర్గాల నుండి ప్రతినిధులను కలిసి తీసుకువస్తుంది.

నార్త్ బ్లాక్, డీఓపీటీలో ఐఏఎస్/ సివిల్ సర్వీసెస్ పరీక్ష 2020 అఖిల భారత టాపర్లను సన్మానించిన కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 22:కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖల సహాయమంత్రి (స్వతంత్ర బాధ్యత), భూవిజ్ఞానాలశాఖ, పీఎంఓ, వ్యక్తిగత, ప్రజా సమస్యలు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్షశాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఐఏఎస్/ సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్ 2020లో విజయం సాధించిన 20 మంది టాపర్లతో మాట్లాడారు. ఆయన వారిని నార్త్ బ్లాక్ లోని పర్సనల్ ఉ ట్రైనింగ్ (డీఓపీటీ) ప్రధాన కార్యాలయంలోకి పిలిపించారు. సివిల్స్ పరీక్ష ఫలితాలను ఇటీవల ప్రకటించారు. టాప్ -20 ర్యాంకుల హోల్డర్లను, వారి కుటుంబ సభ్యులను స్వాగతిస్తూ డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడారు. టాప్ 20 అభ్యర్థుల్లో 10 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారని, వీళ్లు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుండి వచ్చినందున దేశమంతటా సేవలు అందించబోతుండటం చాలా సంతోషాన్ని ఇస్తోందని, ప్రోత్సాహకరంగా ఉంటుందని అన్నారు. ఈ ర్యాంకర్లు బీహార్, చండీగఢ్, ఢిల్లీ, గుజరాత్, హర్యానా, జార్ఖండ్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, ఉత్తర ప్రదేశ్ వాసులు. గత కొన్ని సంవత్సరాలుగా లింగస్థాయిలో, ప్రాంతీయ స్థాయిలో జనాభాలో వస్తున్న మార్పులు మనలాంటి విభిన్న దేశాలకు బాగా ఉపయోగపడతాయని మంత్రి చెప్పారు. మొత్తం 761 మంది అభ్యర్థులు (545 మంది పురుషులు 216 మంది మహిళలు) పేర్లను కమిషన్ సిఫార్సు చేసినట్లు మంత్రికి సమాచారం అందించారు. వీరందరినీ ఈ సంవత్సరం వివిధ సేవల కోసం నియమిస్తారు. డాక్టర్ జితేంద్ర సింగ్ 2014 నుంచి డీఓపీటీ ద్వారా ఆల్ ఇండియా టాపర్‌లను వ్యక్తిగతంగా నార్త్ బ్లాక్‌కు ఆహ్వానించి సత్కరించే కొత్త సంప్రదాయాన్ని ప్రవేశపెట్టారు. అప్పటి నుండి ఈ సంప్రదాయం కొనసాగుతోంది.

యువ అధికారులను నవభారత నిర్మాతలుగా అభివర్ణించిన డాక్టర్ జితేంద్ర సింగ్, భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 వ సంవత్సరంలో సేవల్లోకి ప్రవేశించడం విశేషమని వ్యాఖ్యానించారు. స్వతంత్ర భారతదేశం 100 ఏళ్లు పూర్తి చేసుకునే వరకు వీళ్లు ఉద్యోగాల్లో ఉంటారని, ప్రధాని నరేంద్రమోదీ నవభారత్ విజన్ను గుర్తిస్తారని సింగ్ వివరించారు. ప్రపంచమంతటినీ భారతదేశం నడిపించాలన్నది ఆయన ఆలోచన అని చెప్పారు. ప్రధాని మోడీ హయాంలో, భారతదేశం ఇప్పటికే అధిరోహణలో ఉందని, ఈ కొత్త తరహా పౌర సేవకులకు మనదేశాన్ని ప్రపంచస్థాయిలో అగ్రశ్రేణికి తీసుకెళ్లే ప్రత్యేక బాధ్యత ఉందని ఆయన అన్నారు. గత ఏడు సంవత్సరాలలో యువ ప్రొబేషనర్లు, ఐఏఎస్ అధికారుల కోసం తీసుకువచ్చిన కొన్ని సరికొత్త సంస్కరణలను కూడా డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కేటాయించిన కేడర్‌లో చేరడానికి సంబంధిత రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతానికి వెళ్లే ముందు కేంద్ర ప్రభుత్వం వద్ద 3 నెలలు పనిచేసే విధానాన్ని కూడా ఆయన ప్రవేశపెట్టారు. ఈ 20 మంది టాపర్లలో పదకొండు మంది ఇంజనీర్లు ముగ్గురు మెడికోలు కూడా ఉన్నారని మంత్రి గుర్తించారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ ప్రత్యేక పథకాలు, కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లడంలో వారి పాత్ర కీలకమని అన్నారు. ఆరోగ్యం, వ్యవసాయం, పారిశుధ్యం, విద్య, నైపుణ్యాలు మొబిలిటీ వంటి రంగాలలో ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాలకు సాంకేతిక నిపుణుల అవసరం ఎంతో ఉందని మంత్రి వివరించారు.

ఆధునిక పాఠ్యాంశాలు, సమ్మిళిత విధానం ద్వారా ఎల్‌బీఎస్ఎఎ ముసోరీ, ఇతర సెంట్రల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లలో శిక్షణా విధానాలను మార్చుతున్నామని డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు. పరిపాలన అంతిమ లక్ష్యం మిషన్ కర్మయోగి ద్వారా భారతదేశంలోని సామాన్యుల కోసం "ఈజ్ ఆఫ్ లివింగ్" తీసుకురావడమే అని ఆయన అన్నారు.

సీఎన్ఈ 2020 లో టాపర్లను స్వాగతిస్తూ, సిబ్బంది శిక్షణ విభాగం కార్యదర్శి పీకే త్రిపాఠి మాట్లాడారు. ఎంతో ముఖ్యమైన సమయంలో (అమృత్‌కాల్) ఈ అధికారులు ప్రభుత్వ సేవలో ప్రవేశిస్తున్నారని, దేశ భవిష్యత్తు నిర్మించడానికి వారు రాబోయే 25 సంవత్సరాలలో అద్భుతమైన పాత్ర పోషించాలని అన్నారు. అవకాశాలు, సవాళ్లతో నిండిన వారి కెరీర్ ద్వారా ఈ అధికారులు దేశానికి తమ ఉత్తమమైన వాటిని అందించగలరని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ఆ శాఖ సీనియర్ అధికారులందరూ హాజరయ్యారు.

ఏపీలో స్వల్పంగా పెరిగిన కరోనా.. ఆ జిల్లాలో అత్యధిక కేసులు

అమరావతి, అక్టోబర్ 22:ఆంధ్రప్రదేశ్ లో కరోనా కేసులు స్వల్పంగా పెరిగాయి. గడిచిన 24 గంటల్లో 43,494 మంది సాంపిల్స్ పరీక్షించగా.. కొత్తగా 478 కేసులు బయట పడ్డాయి. కోవిడ్ తో కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇద్దరు, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. అదే సమయంలో 574 మంది కోవిడ్ నుంచి పూర్తిగా కోలుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 20,62,781కి చేరగా.. ఇందులో 20,43,050 మంది కోలుకున్నారు. ప్రస్తుతం 5,398 యాక్టివ్ కేసులు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 14,333 మంది కరోనాతో మరణించారు.

అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లో 119 కేసులు నమోదు కాగా. అత్యల్పంగా కర్నూలు జిల్లాలో 4 కేసులు నమోదు అయ్యాయి. అనంతపురం 18, చిత్తూరు 96, గుంటూరు 60, కడప 24, కృష్ణా 39, నెల్లూరు 29, ప్రకాశం 18, శ్రీకాకుళం 11, విశాఖపట్నం 20, విజయనగరం 5 పశ్చిమగోదావరి జిల్లాలో 35 కేసులు వెలుగు చూశాయి.

పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం : శాంతి కుమారి

ములుగు, అక్టోబర్ 22:: పోడు భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు తెలంగాణ ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఆ దిశగా అటవీ, రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖ అధికారుల సమన్వయంతో వ్యవహరించాలని అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. శుక్రవారం ములుగు జిల్లా పర్యటనలో భాగంగా గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్టు, సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, పిసిసిఎస్ శోభ, అదనపు పిసిసిఎఫ్ మోహన్ చంద్ర ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా జిల్లాకు చేరుకున్నారు.

అనంతరం కలెక్టర్ కార్యాలయంలో ములుగు, భూపాల పల్లి, వరంగల్, మహబూబాబాద్, జిల్లాలకు సంబంధించిన పోడు భూములు సమస్యలు, అడవుల పరిరక్షణ, హరితహారం అంశాలపై ఆయా జిల్లాల జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలో, అటవీశాఖ అధికారులు, డీఎఫ్‌వోలు, రెవెన్యూ,గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న అటవీ భూములను పరిరక్షించాల్సిన భాధ్యత అధికారులదేనన్నారు. ములుగు, భూపాల పల్లి, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో అటవీ ప్రాంతం ఎక్కువ గా ఉందన్నారు. ఇక నుంచి ఎకరం కూడా అటవీ ప్రాంతం ఆక్రమణకు గురికాకుండా చూడలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు యంత్రాంగం బాధ్యతాయుత

దళిత వ్యతిరేకి బీజేపీని తరిమికొట్టాలి : మంత్రి కొప్పుల ఈశ్వర్

జమ్మికుంట, అక్టోబర్ 22: దళితులంటే బీజేపీకి పడదు. దళిత వ్యతిరేక పార్టీ అది. ఇగ ఈటలకు దళితులు ఎదగడం ఇష్టం లేదు. అందుకే ఆ పార్టీ నాయకులు దళిత బంధును ఆపిచ్చిన్రు. అయితే ఏమైతది.. మరో వారం రోజుల్ల మళ్లీ దళిత బంధు గ్రౌండింగ్ అయితది. అందరికీ యూనిట్లు వస్తయ్.. కానీ, ఇక్కడో విషయం తెలుసుకోవాలే.. మన కోసం పనిచేసే టోళ్లేవరు.. మనలను ఎదగనీయ్యకుండా చేసేదెవరు.. తెలుసుకోవాలి. ఆలోచించాలే.

దళితులు బీజేపీని తరిమి కొట్టాలే. ఇక్కడ స్థానం లేకుండా చేయాలే. 30న జరిగే ఉప ఎన్నికల్లో ఆ పార్టీకి దిమ్మదిరిగే గుణపాఠం చెప్పాలే. గెల్లు సీనును గెలిపించుకోవాలి..'అని మంత్రి కొప్పుల ఈశ్వర్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 11,12వ వార్డుల్లో ఎమ్మెల్యే నరేందర్‌తో కలిసి పర్యటించారు. టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్ కోసం ప్రచారం చేశారు. ఓటును అభ్యర్థించారు.

ఆయా కాలనీవాసులతో . ఇష్టాగోష్ఠి గా ముచ్చటించారు. టీఆర్ఎస్ లో ఈటలకు దక్కిన గౌరవం ఎవరికీ దక్కలేదని, పదవులన్నీ అనుభవించిన విషయాలను వివరించారు. పార్టీకి వెన్నుపోటు పొడిచేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాల భూములు కొనుక్కుని, తన సమస్యను ప్రజలపై రుద్దారని దుయ్యబట్టారు. ఆస్తులు, అంతస్తులు కాపాడుకునేందుకే బీజేపీలో చేరాడని పేర్కొన్నారు. మంత్రిగా ఇక్కడి ప్రజలను పట్టించుకోలేదని, ఒక్కడ డబుల్ బెడ్రూం ఇండ్లను కట్టించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంత్రిగా అభివృద్ధి చేయని ఈటల, ఇప్పుడు ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఏం చేస్తాడని ప్రశ్నించారు. ఆయనకు గెలిచే అవకాశమే లేదని, పేదింటి బిడ్డ గెల్లు సీనునే గెలిపించుకుకోవాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిస్తామని, మరో రెండున్నరేళ్లు అధికారంలో ఉండేది టీఆర్ఎస్ సర్కారేనని స్పష్టం చేశారు.

బీజేపీ ఇక్కడ గెలిస్తే ప్రజలకు ప్రమాదమని ఎమ్మెల్యే నరేందర్ అన్నారు. ఈటల తన స్వార్థం కోసం రాజీనామా చేస్తే ఇక్కడ ఎన్నికలు వచ్చాయన్నారు. గెల్లు శ్రీనివాస్ గెలిస్తేనే హుజూరాబాద్ ప్రజలు మరింత అభివృద్ధి చెందుతారని తెలిపారు. గతంలో ఆరుసార్లు కారు గుర్తుకే ఓటేశారని, ఈ సారి కూడా కారు గుర్తుకే ఓటేసి గెలిపించాలన్నారు. పనిచేసే సర్కారుకే ఓటేస్తే దళితులు ఉన్నతంగా బతుకుతారని పేర్కొన్నారు.

ధరలు పెంచుతూ పోతున్న బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. 30న గ్యాస్ సిలెండర్‌కు దండం పెట్టి కారు గుర్తుకు ఓటేయ్యాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారం సందర్భంగా కాలనీవాసులు టీఆర్ఎస్ కే ఓటేస్తామని ప్రతినబూనారు. జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో పనిచేస్తామని తెలిపారు. దళిత బంధు ఇచ్చిన సర్కారు వెంట నడుస్తామని హామీ ఇచ్చారు. ప్రచారాల్లో మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్లు కళావతి, విజయలక్ష్మి, రాము, సారంగం, మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ సంపత్, నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

గెల్లు శ్రీనివాస్ యాదవ్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి : ఆర్యవైశ్య ప్రముఖుల పిలుపు

జమ్మికుంట, అక్టోబర్ 22: : ఆర్యవైశ్య సోదరులు అందరూ ఒక్కతాటి మీద ఉందాం..సీఎం కేసీఆర్ గారి బాటలో నడిచి, హుజురాబాద్ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి గెల్లు శ్రీనివాస్ యాదవ్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు కోరారు. శుక్రవారం హుజూరాబాద్ నియోజకవర్గం జమ్మికుంటలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్తా, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, తెలంగాణ రాష్ట్ర హస్త కళల కార్పొరేషన్ చైర్మన్ బొల్లం సంపత్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, ఆర్యవైశ్య సంఘము రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీ నారాయణ తదితరులు మాట్లాడారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సాగునీటి ప్రాజెక్టుల ద్వారా..మరియు కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా రైతులు మంచిగా వరి పంట పండిస్తున్నారు. దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణ గా.. రాష్ట్రాన్ని ధాన్యగార భాండగారంగా తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ ది అన్నారు. రాష్ట్రంలో 24 గంటల కరెంట్ ఇచ్చి క్రాప్ హాలిడేస్ లేకుండా చేశారు. రాష్ట్రంలో వ్యాపారులు అందరూ ప్రశాంతంగా వ్యాపారం చేసుకుంటున్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగింది.

ఆర్యవైశ్య జాతికి కూడా గౌరవం దక్కింది. ఆర్యవైశ్య కులానికి చెందిన వారిని గతంలో ఏ ముఖ్యమంత్రి, పట్టించుకోలేదు, వారికి ప్రాధాన్యత ఇవ్వలేదు కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినంత ప్రాధాన్యత ఏ ప్రభుత్వం కూడా ఇవ్వలేదు అన్నారు. ముఖ్యం గా ఆర్యవైశ్యులకు 4 గురుకి స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ పదవులు.. 11 మందికి మున్సిపల్ చైర్మన్ పదవులు, ఒకరికి ఎమ్మెల్సీ పదవి, ఒకరికి ఎమ్మెల్యే పదవి కూడా దక్కింది అని అన్నారు.

ఆర్య వైశ్యులు సామాజిక సేవలోను ముందుంటారు.ఏ పదవులు ఇచ్చినా నీతి నిజాయితీ తో కష్టపడి పని చేస్తారని అన్నారు. రాష్ట్రంలో ఇన్ని సంవత్సరాల కాలంలో ఆర్యవైశ్యులను గుర్తించి, వారికి ప్రాముఖ్యత ఇచ్చింది. న్యాయం చేసింది సీఎం కేసీఆర్ మాత్రమే..70 ఏండ్ల చరిత్ర లో జరగని న్యాయం ఆర్యవైశ్యులకు ఈ 7 సంవత్సరాల కాలంలో జరిగిందని అన్నారు. టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఆర్యవైశ్యులకు న్యాయం చేయలేదు.

టీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే ఆర్యవైశ్యులకు గౌరవం దక్కింది. కాబట్టి మనందరం, వారికి ఋణపడి ఉండాలన్నారు. మన రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న సీఎం కేసీఆర్ కు మద్దతుగా నిలబడాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి గెల్లు శ్రీనివాస్ యాదవ్ ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బచ్చు భాస్కర్ , జమ్మికుంట రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజమౌళి, జిల్లా ఆర్యవైశ్య యూత్ ప్రెసిడెంట్ ఇరుకుళ్ల రామకృష్ణ , అడ్వకేట్ సోమ భరత్, టీటీడీ బోర్డ్ మెంబెర్ రాములు, చింతల రవికుమార్, మాసెట్టి శ్రీనివాస్, లక్ష్మినారాయణ పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి: జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 22:నేటినిజం (ప్రతినిధి): అక్టోబర్ 22: అభివృద్ధి పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శుక్రవారం కలెక్టర్ వేములవాడలో పర్యటించి, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణంలో ఉన్న వైకుంఠదామ పనులను తనిఖీ చేశారు. ఫ్రీజర్ కు సంబంధించి విడిగా ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. నిర్మాణంలో కొన్ని మార్పులకు కలెక్టర్ సూచనలు చేశారు. నిర్మాణాన్ని రెండు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ వద్ద ఏర్పాటు చేయతలపెట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్, స్థానిక శామకుంట వద్ద ఏర్పాటుచేస్తున్న మార్కెట్ స్థలాలను కలెక్టర్ పరిశీలించారు. మార్కెట్ల నిర్మాణ పనుల ప్రారంభానికి చర్యలు చేపట్టి, నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఆయన అన్నారు.

కలెక్టర్ పర్యటన సందర్భంగా వేములవాడ మునిసిపల్ చైర్ పర్సన్ రామతీర్థం మాధవి, మునిసిపల్ కమిషనర్ శ్యానీసుందర్ రావు, పబ్లిక్ హెల్త్ డిఇ ప్రసాద్, మునిసిపల్ ఏఇ నరసింహస్వామి తదితరులు ఉన్నారు.

చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 22:నేటినిజం (ప్రతినిధి): ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీన ఆదివారం జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం చందుర్తి మండల కేంద్రంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధతకై చలో హైదరాబాద్ మాదిగ ఉద్యోగాల ఐదవ జాతీయ మహాసభ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు గుండా థామస్ మాదిగ హాజరై మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 1994 ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామములో ఏర్పడ్డది మూడు సంవత్సరాలో వర్గీకరణ సాధించుకొని అనేకమైన ఫలాలు మాదిగ.మాదిగ ఉపకులాల పొందా యన్నారు. సామాజిక కోణం లో ఎస్సీ. ఎస్టీ బిసి మైనార్టీల కొరకు అనేక ఉద్యమాలు చేసి హక్కులు సాధించిపెట్టారని గుర్తు చేశారు. మాదిగల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఏర్పడిన మాదిగ ఉద్యోగాల మహా సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి మాదిగ.మాదిగ ఉపకులాల వేలాదిగా తరలివ చ్చి విజయవంతం చేయాలన్నారు ఈకార్యక్రమంలో చందుర్తి మండల కో-ఆర్డినేటర్ తాండ్ర తిరుపతి. జిల్లా కోఆర్డినేటర్ తలారి సురేష్. ఎడల్లి నాగరాజు.ఎడపల్లి మహేష్. ఎమ్మార్పీఎస్ నాయకులు లింగంపల్లి వెంకటి. అర్జున్. నర్సయ్య.మదన్.శేఖర్. హనుమయ్య. మారంతి.ప్రేమ్. లక్ష్మీరాజం పాల్గొన్నారు,

సీఎం కేసీఆర్ విద్యుత్ కార్మికుల పక్షపాతి : మంత్రి జగదీష్‌రెడ్డి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 22: సీఎం కేసీఆర్ విద్యుత్ కార్మికుల పక్షపాతి. అడగకుండానే విద్యుత్ కార్మికులకు వరాలు ఇచ్చిన మహానేత అని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి కొనియాడారు. అటువంటి సంస్థను పరిరక్షించు కోవడంలో కార్మికులు ముందుండాలని ఆయన కోరారు.

కార్మిక సంఘాలు బాధ్యతాయుతంగా ఉన్నప్పుడే అది సాధ్యపడుతుందని ఆయన చెప్పారు.కార్మికులే సంస్థలకు యజమానులుగా భావించిన రోజున అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం జిల్లా కేంద్రంలో జరిగిన 1104 విద్యుత్ కార్మిక రాష్ట్ర జెనరల్ కౌన్సిల్ సమావేశానికి మంత్రులు జగదీష్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు పద్మారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ.. సంస్థల మనుగడ అందులో పనిచేసే కార్మికుల పనితీరు మీద ఆధారపడి ఉంటుందన్నారు. ఈ రోజు విద్యుత్ రంగ సంస్థలు నిలదొక్కుకున్నాయి అంటే అందులో పనిచేస్తున్న కార్మికుల నిబద్ధతతో మాత్రమేని పేర్కొన్నారు.

ప్రత్యేక రాష్ట్ర వాంఛ సరైనదేనని రుజువు పర్చింది కుడా విద్యుత్ రంగమేనన్నారు.

రాష్ట్రం ఆవిర్భవించిన రోజున విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 600 మేగావాట్ల ఉంటే అది ఇప్పుడు16000 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యానికి పెరిగిందన్నారు. అంతేకాకుండా తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన రోజున కేవలం 70 మెగావాట్లకు పరిమితమైన సోలార్ ఇప్పుడు 4000 మెగావాట్లకు చేరిందన్నారు.అందుకు కారణం ఆయా సంస్థలలో పనిచేసే కార్మికులే కారణమన్నారు. ఏ విద్యుత్ తో తెలంగాణ లో నాశనం అయింది అనుకుంటున్న వ్యవసాయ రంగానికి గడిచిన నాలుగేండ్లుగా నిరంతర నాణ్యమైన ఉచిత విద్యుత్ అందుతుంది అంటే అందుకు కార్మికులు పడిన శ్రమనే కారణమని ఆయన తేల్చి చెప్పారు.

2012-13 ప్రాంతంలో విద్యుత్ కోసం పారిశ్రామికవేత్తలు రోడ్లెక్కి ధర్నాలు చేసిన సందర్భాన్ని ఆయన ఉటంకిస్తూ తెలంగాణా ఏర్పాటు జరిగితే పరిశ్రమలు తరలి పోతాయంటూ బెదిరించిన ఉదంతాలను మంత్రి గుర్తు చేశారు. అందుకు భిన్నంగా తెలంగాణ ఏర్పాటు అనంతరం కొత్తగా 50 వేల పరిశ్రమలు అదనంగా రావడమే కాకుండా 18 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయని ఆయన తెలిపారు.అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలే కారణమని మంత్రి జగదీష్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, ఆ సంఘం ప్రధాన కార్యదర్శి సాయిబాబా, సంఘం ప్రతినిధులు జనార్దన్ రెడ్డి, శంకర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

13 ఏళ్ళుగా తప్పించుకుని తిరుగుతున్న నిందితుడి అరెస్ట్

కరీంనగర్, అక్టోబర్ 22:(నేటినిజం ప్రతినిధి): అదనపు కట్నం కేసులో నిందితుడిగా ఉండి గత 13 ఏళ్ళుగా తప్పించుకతిరుగుతున్న నిందితుడిని శుక్రవారంనాడు కరీంనగర్ మహిళ పోలీస్‌స్టేషన్ అధికారులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.

హైదరాబాద్‌లోని గోల్కొండలో గల ఓయు కాలనీకి చెందిన మహ్మద్ నలీంబేగ్(32) కు కరీంనగర్‌లోని ముకరంపుర ప్రాంతానికి చెందిన మహిళతో 2001లో వివాహం జరిగింది. అనంతరం నుండి అదనపుకట్నం కోసం వేధిస్తుండటంతో భార్య కరీంనగర్‌లోని మహిళ పోలీస్‌స్టేషన్‌లో 2008లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదైంది. అప్పటి నుండి తప్పించుకుని తిరుగుతూ దుబాయ్‌కి వెళ్ళాడు.

శుక్రవారం నాడు దుబాయ్ నుండి తిరిగివస్తున్నాడని పక్కా సమాచారం అందుకున్న పోలీసులు వలపన్ని పట్టుకుని వారెంట్‌ను అమలు చేశారు. శనివారంనాడు న్యాయస్థానంలో హాజరుపరుస్తామని మహిళ పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ బి శ్రీనివాస్ తెలిపారు. 13ఏళ్ళుగా పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకున్న పోలీసులను కరీంనగర్ పోలీస్ కమీషనర్ వి సత్యనారాయణ అభినందించారు.

విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేసిన చేన్నడి మార్తాండ రావు మెమోరియల్ ట్రస్ట్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 22:నేటినిజం (ప్రతినిధి): వేములవాడ విలీన గ్రామమైన శాత్రాలాజ్ పల్లి గ్రామంలో చెన్న డి మార్తాండ రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ చేన్నాడి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవలు చేయడానికి ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిం దని ఆమె అన్నారు .

ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు భాగ్యలత, అరుంధతి, వేణు కిషన్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంగ స్వామి యాదవ్, టిఆర్ఎస్ పార్టీ నాయకుడు సలీం, విద్యా కమిటీ చైర్మన్ నరేష్, రమేష్ జెడ్‌పిహెచ్.ఎస్ ప్రిన్సిపాల్ మధుకర్, రాజయ్య ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

కుటుంబమంతటికీ అధిక ప్రయోజనం కలిగించే ఆరోగ్యదాయకమైన ఔషదం 'రెస్టోరా గోల్డ్'ను ఆవిష్కరించిన డాబర్

హైదరాబాద్ , అక్టోబర్ 22: భారతదేశంలో సుప్రసిద్ధ, శాస్త్ర ఆధారిత ఆయుర్వేద కంపెనీ డాబర్ ఇండియా లిమిటెడ్ ఇప్పుడు కుటుంబమంతటికీ అధిక ప్రయోజనాన్ని కలిగించే జీర్ణక్రియ ఔషదం 'డాబర్ రెస్టోరా గోల్డ్'ను ఆవిష్కరిస్తున్నట్లు వెల్లడించింది. ఆరోగ్య వంతమైన జీర్ణక్రియను నిర్వహించడంలో ఇది తోడ్పడటంతో పాటుగా నీరసం, అలసట నుంచి ఉపశమనాన్ని ఇది అందిస్తుంది.ప్రీమియం నాణ్యత కలిగిన ఆరోగ్యదాయకమైన ఔషద ఉత్పత్తి డాబర్ రెస్టోరా గోల్డ్ . ఇది మీ శరీరం లోపల నుంచి ఉత్తేజం కావడానికి అవసరమైన అత్యవసర పోషకాలను అందిస్తుంది. శక్తి మరియు బలం కోసం తీర్చిదిద్దబడిన అత్యున్నత ఆయుర్వేదిక్ ఔషదాలలో ఇది ఒకటి. దీనిలో అత్యంత సహజసిద్ధమైన పదార్థాలైనటువంటి నేపాల్‌లోని వ్యవసాయక్షేత్రాలలో లభించే అత్యున్నత నాణ్యత కలిగిన యాపిల్స్, అంజీర్, ఖర్జూర , ద్రాక్ష, కేసర్, సేఫ్ద్ ముస్లి, అశ్వగంధ, షతవారి వంటివి ఉన్నాయి. ఇవి ఎలాంటి దుష్పరిణామాలు లేకుండా పునరుద్ధరించబడిన శక్తిని అందిస్తాయి. ఈ టానిక్‌లో ఏపీఐ ప్రమాణాలకు అనుగుణంగా అతి తక్కువ ఆల్కహాల్ కంటెంట్ వినియోగించడంతో పాటుగా డబుల్ ఫిల్టరేషన్‌తో ప్రీమియం అనవ్ జోడించారు. ఆరోగ్యవంతమైన జీర్ణక్రియకు ఈ సూత్రీకరణ తోడ్పడటంతో పాటుగా శరీరంలో అవాంఛిత విష పదార్థాలను తొలగించడంలో సహాయపడుతుంది అని డాబర్ ఇండియా లిమిటెడ్, కేటగిరి హెడ్? ఆయుర్వేదిక్ ఎథకల్స్ , డాక్టర్ మణ్‌దీప్ ఓబరాయ్ అన్నారు. డాబర్ రెస్టోరా గోల్డ్ ధర 450 మిల్లీ లీటర్ల ప్యాక్ ధర 325 రూపాయలు. ఇది అన్ని సుప్రసిద్ధ ఈ కామర్స్ వేదికలు మరియు రెగ్యులర్ రిటైల్ ఛానెల్స్ వద్ద దేశవ్యాప్తంగా లభ్యమవుతుంది. అత్యధిక యాంటి ఆక్సిడెంట్లు కలిగిన డాబర్ రెస్టోరా గోల్డ్, ఓ పునరుద్ధరణ ఔషదం. ఇది జీర్ణక్రియకు తోడ్పడటంతో పాటుగా ఆకలినీ పెంచుతుంది. అత్యున్నత శ్రేణి సూపర్ ఫుడ్స్‌తో లోడ్ చేయబడిన ఈ ఉత్పత్తి ఆకృతి ప్రీమియంగా ఉంటుంది. సంప్రదాయ ఔషద వ్యవస్థ ఆయుర్వేదం. ఆరోగ్యపరంగా అవసరమైన రీతిలో శరీరం ఉండేందుకు మరియు వ్యాధుల నివారణకు ఇది తోడ్పడుతుంది. ఎన్నో తరాలుగా, డాబర్ ఈ రంగంలో అత్యంత నమ్మకమైన బ్రాండ్‌గా వెలుగొందుతుండటంతో పాటుగా విభిన్నమైన ఆయుర్వేద సూత్రాలతో మీ ఆరోగ్యం కాపాడుతుంది. ఇప్పుడు విడుదల చేసిన డాబర్ రెస్టోరా గోల్డ్ తో అత్యంత సురక్షితమైన, ప్రభావవంతమైన ఉత్పత్తులను ప్రతి ఇంటిలోనూ అందించాలనే మా ప్రయత్నాలలో మరో ముందుడుగు వేశాం. కుటుంబమంతటికీ పునరుత్తేజ ఔషదంగా డాబర్ రెస్టోరా గోల్డ్ నిలుస్తుంది అని డాక్టర్ ఓబరాయ్ అన్నారు.

లనెక్స్ ఇండియా ఇప్పుడు వర్క్-సర్టిఫైడ్‌కి గొప్ప ప్రదేశం

- భారతదేశంలో 1100 పైగా సంస్థలు అంచనా వేయబడ్డాయి
- 22 కంటే ఎక్కువ ఇండస్ట్రీలలో సర్వే జరిగింది

హైదరాబాద్ , అక్టోబర్ 22: -ప్రముఖ స్పెషాలిటీ కెమికల్స్ కంపెనీ లనెక్స్ ఇండియా గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇన్స్టిట్యూట్ ద్వారా భారతదేశంలో (అక్టోబర్ 2021 నుండి అక్టోబర్, 2022 వరకు) వర్క్-సర్టిఫైడ్ కు గొప్ప ప్రదేశం. ధృవీకరణ అనేది హై-ట్రస్ట్, హై-పెర్ఫార్మెన్స్ కల్చర్ అందరికీ అద్భుతమైన ఉద్యోగి అనుభవాన్ని అందించడంలో సంస్థ ప్రయత్నాలను గుర్తిస్తుంది. గ్రేట్ ప్లేస్ టు వర్క్ అనేది కార్యాలయ సంస్కృతిపై ప్రపంచ అధికారం. 1992 నుండి, వారు ప్రపంచవ్యాప్తంగా 100 మిలియన్లకు పైగా ఉద్యోగులను సర్వే చేశారు మరియు ఒక గ్రేట్ వర్క్ ప్లేస్: ట్రస్ట్ ఏమిటో నిర్వచించడానికి ఆ లోతైన అంతర్దృష్టులను ఉపయోగించారు. వారి ఉద్యోగుల సర్వే ప్లాట్‌ఫామ్ నాయకులకు వ్యూహాత్మక వ్యక్తుల నిర్ణయాలు తీసుకోవడానికి అవసరమైన ఫీడ్‌బ్యాక్, రియల్ టైమ్ రిపోర్టింగ్ అంతర్దృష్టులతో సాధికారతను అందిస్తుంది. ఈ సంస్థ 60 కి పైగా దేశాలలో వ్యాపారాలు, లాభాపేక్షలేని సంస్థలు మరియు ప్రభుత్వ సంస్థలకు సేవలు అందిస్తుంది మరియు మూడు దశాబ్దాలుగా గొప్ప కార్యాలయాల లక్షణాలపై మార్గదర్శక పరిశోధన నిర్వహించింది. విజయం గురించి వ్యాఖ్యానిస్తూ, లనెక్స్ఇండియా వైస్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ నీలంజన్ బెనర్జీ ఇలా వ్యాఖ్యానించారు, "ఇది మనందరికీ గర్వకారణమైన క్షణం. ఒక సంస్థగా, మేము నిరంతరం బార్‌ను పెంచాలని విశ్వసిస్తున్నాము మరియు మా ఉద్యోగులకు విశ్వసనీయమైన మరియు న్యాయమైన కార్యాలయాన్ని సృష్టించడానికి కట్టుబడి ఉన్నాము. ఈ గుర్తింపుకు మేము కృతజ్ఞతలు తెలుపుతున్నాము మరియు వర్క్-సర్టిఫైడ్ కంపెనీకి గొప్ప ప్రదేశంగా మారినందుకు చాలా సంతోషంగా ఉంది.'' భారతదేశంలో,ఈ సంస్థ ప్రతి సంవత్సరం 22 పరిశ్రమలకు పైగా 1100 కంటే ఎక్కువ సంస్థలతో భాగస్వాములను చేస్తుంది, ఇది వారికి అధిక-విశ్వాసం, హై-పెర్ఫార్మెన్స్ కల్చర్స్‌ను నిర్మించడంలో సహాయపడుతుంది, ఇది స్థిరమైన వ్యాపార ఫలితాలను అందించడానికి రూపొందించబడింది. ఇండియా ఐఎన్‌సి. నుండి వందలాది సిఇఓలు, సిక్స్ఒ గ్రేట్ ప్లేస్ సంఘంలో భాగం.ఫర్ ఆల్ అనేది పని చేయడానికి భారతదేశాన్ని గొప్ప ప్రదేశంగా మార్చాలనే దృష్టికి కట్టుబడి ఉంది. ఇన్స్టిట్యూట్ పరిశోధనలో గ్రేట్ వర్క్ ప్లేస్ గొప్ప నాయకత్వం, స్థిరమైన ఉద్యోగుల అనుభవం మరియు స్థిరమైన ఆర్థిక పనితీరు ద్వారా వర్గీకరించబడతాయి. ఈ సంస్థలు సంస్థలో వారి పాత్ర, లింగం, పదవీకాలం లేదా స్థాయితో సంబంధం లేకుండా తమ ఉద్యోగులందరికీ స్థిరమైన అనుభవాన్ని అందించగలవు. వారి లీడర్లు ఫర్ ఆల్ పని చేయడానికి ఒక గొప్ప ప్రదేశాన్ని సృష్టించడం మరియు నిలబెట్టుకోవాలనే దృష్టిని విశ్వసిస్తారు మరియు ' ఫర్ ఆల్' నాయకులకు రోల్ మోడల్.

నటి సుధాచంద్రన్‌కు క్షమాపణ చెప్పిన సీఐఎస్ఎఫ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 22: అలనాటి నటి, నర్తకి అయిన సుధాచంద్రన్‌కు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) క్షమాపణ చెప్పింది. ఇటీవల సుధాచంద్రన్‌కు ఎయిర్‌పోర్టులో అవమానం జరిగింది. సెక్యూరిటీ విధుల్లో ఉన్న సీఐఎస్ఎఫ్ అధికారిణి.. నటి సుధాచంద్రన్‌ను కృత్రిమ కాలును తీసి చూపించమని అడిగింది. ఈ ఘటనపై మనస్తాపం చెందిన సుధాచంద్రన్ ప్రధానిని ప్రశ్నిస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియో పోస్ట్ చేశారు.

'గుడ్ ఈవినింగ్ ప్రధాని మోదీగారు నేను మీకొక పర్సనల్ విషయం చెప్పాలనుకుంటున్నా. ఇది కేంద్ర ప్రభుత్వానికి నా అభ్యర్థన. నా పేరు సుధాచంద్రన్. వృత్తిరీత్యా నటిని, డ్యాన్సర్‌ను. కృత్రిమ కాలుతో నృత్యాలు చేసి చరిత్ర సృష్టించాను. నా దేశం గర్వపడేలా చేశాను. నేను నా ఈవెంట్ల కోసం ఎక్కడి వెళ్లినా ఎయిర్‌పోర్టుల్లో సెక్యూరిటీ సిబ్బంది నా కృత్రిమ కాలును తీసి చూపించాలనడం పరిపాటిగా మారింది. ఇది మానవీయమేనా మోదీ గారు..? దేశం ఎక్కడికి వెళ్తున్నది..? మన దేశంలో ఒక మహిళ సాటి మహిళకు ఇచ్చే గౌరవం ఇదేనా..?' అని వీడియోలో ప్రశ్నించారు. మోదీగారు దయచేసి సీనియర్ సిటిజన్‌లకు సీనియర్ సిటిజన్ అని తెలిపే కార్డులను ఇప్పించండని కోరారు.

ఈ వీడియోపై సీఐఎస్ఎఫ్ ట్విట్టర్ ద్వారా స్పందించింది. సుధాచంద్రన్ గారూ మీకు కలిగిన అసౌకర్యానికి మమ్మల్ని క్షమించండి. ప్రొటోకాల్ ప్రకారం భద్రత కోసం కృత్రిమ అవయవాలను తీసి చెక్ చేయాల్సిన అవసరం ఉన్నది. కానీ ప్రయాణికులను అవమానించాలనే ఉద్దేశం కాదు అంటూ సీఐఎస్ఎఫ్ ట్వీట్ చేసింది. నటి సుధాచంద్రన్ గతంలో ఓ రోడ్డు ప్రమాదంలో కాలును కోల్పోయింది.

Printed, Published and owned by VEENADAS,at